

ముగిసిన పార్వేట పల్లకి ఉత్సవాలు

- 16 నుంచి అహోబిలంలో బ్రహ్మోత్సవాలు
- పట్టువస్త్రాలు సమర్పించిన తెలంగాణ ప్రభుత్వం



ఉత్సవ పల్లకిలో కొలువుదీరిన జ్వాలా లక్ష్మీనరసింహస్వామి ప్రహ్లాద వరదస్వామి

రుద్రవరం, ఫిబ్రవరి 28: అహోబిళం దేవస్థానం నుంచి మకర సంక్రాంతి రోజు ప్రారంభమైన పార్వేట ఉత్సవ పల్లకి బుధవారం రుద్రవరం గ్రామంలో ముగిసింది. పార్వేట ఉత్సవం ఆళ్లగడ్డ, రుద్రవరం, ఉయ్యాలవాడ మండలాల్లో 33 గ్రామాలు, 44 రోజులపాటు కన్నులపండువగా గ్రామ గ్రామాన సాగింది. అహోబిళం కొండపైకి భక్తులను ఆహ్వానించేందుకే పల్లకిలో కొలువుదీరి అరుగుల వద్ద ఆహ్వానం పలికారు.

మార్చి 16 నుంచి అహోబిలంలో బ్రహ్మోత్సవాలు

అహోబిలం క్షేత్రంలో మార్చి 16 నుంచి బ్రహ్మోత్సవాలు ప్రారంభమవుతాయి. మార్చి 26 వరకు ఈ బ్రహ్మోత్సవాలు కొనసాగుతాయి. మహారాష్ట్ర, కర్ణాటక, తెలంగాణ, తమిళనాడు, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల నుంచి భారీ సంఖ్యలో భక్తులు తరలివస్తారు. గత కొన్నేళ్ల నుంచి ఈ రాష్ట్రాల నుంచి భక్తులు తరలి రావడం, స్వామి అమ్మవార్లను దర్శించుకోవడం ఆనవాయితీగా వస్తోంది.

తెలంగాణ ప్రభుత్వం తొలిసారిగా పట్టువస్త్రాల సమర్పణ

పూర్వ కాలంలోనే తెలంగాణ నుంచి అహోబిళ దేవస్థానానికి కైంకర్యాలు అందేవి. ఆ సాంప్రదాయాన్ని తిరిగి తొలిసారిగా తెలంగాణ ప్రభుత్వం మొదలుపెట్టింది. అహోబిళ లక్ష్మీనరసింహ స్వామికి బుధవారం పట్టువస్త్రాలను సమర్పించింది. రుద్రవరంలో పార్వేట పల్లకిలో కొలువుదీరిన జ్వాలా లక్ష్మీనరసింహస్వామి, ప్రహ్లాద వరదస్వాములకు తెలంగాణ రాష్ట్ర దేవదాయశాఖ కమిషనర్ అనిల్‌కుమార్, గద్వాల జిల్లా జోగులాంబ దేవస్థానం ఈవో పురంధర్‌కుమార్ పట్టు వస్త్రాలను సమర్పించారు. అనంతరం ఆళ్లగడ్డ మార్కెట్‌యార్డు చైర్మన్ గంధం రాఘవరెడ్డితో కలిసి ప్రత్యేక పూజలు చేశారు. దేవస్థాన అర్చకులు, సంపత్ కండువాలు, నవ నరసింహస్వామి చిత్రపటం బహూకరించి సన్మానించారు. ఈ సందర్భంగా తెలంగాణ దేవదాయశాఖ కమిషనర్ అనిల్‌కుమార్ మాట్లాడుతూ ఇకపై ప్రతి యేడాది రుద్రవరంలో పార్వేట పల్లకిలో ఉన్న ఉత్సవమూర్తులకు తెలంగాణ ప్రభుత్వం పట్టువస్త్రాలను సమర్పిస్తుందని అన్నారు. అనంతరం అహోబిల మఠం జీపీఏ సంపత్, ప్రధాన అర్చకులు వేణుగోపాలన్, సేతురామన్ చేతుల మీదుగా నరసింహస్వామి చిత్రపటాన్ని అందించి పూలమాలలతో సన్మానించారు.

- రుద్రవరంలోని ఫారెస్టు కార్యాలయ ఆవరణలో అరుగుపై కొలువు దీరిన పార్వేట ఉత్సవమూర్తులకు ఫారెస్టు అధికారులు పట్టువస్త్రాలు సమర్పించారు. జ్వాలా లక్ష్మీనరసింహస్వామి ప్రహ్లాద వరదస్వాములకు ప్రత్యేక పూజలు చేశారు. తరలి వచ్చిన భక్తులు, యాచకులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో నంద్యాల జిల్లా అటవీ అధికారి అనురాగ్ మీనా, రేంజర్ శ్రీపతినాయుడు, డీఆర్వో ముర్తుజావలి, సెక్షన్ ఆఫీసర్లు నాగరాజు, శ్రీనివాసులు, ముక్తర్‌బాషా తదితరులు ఉన్నారు.



పట్టు వస్త్రాలను తీసుకువస్తున్న తెలంగాణ దేవదాయ శాఖ కమిషనర్ అనిల్‌కుమార్

రేపటి నుంచి ఇంటర్ పరీక్షలు

నంద్యాల (నూనెపల్లె), ఫిబ్రవరి 28 : జిల్లాలో ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షలు మార్చి 1వ తేది శుక్రవారం నుంచి ప్రారంభం కానున్నట్లు డీఐఈవో సునీత బుధవారం తెలిపారు. జిల్లాలో 52 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. పర్యవేక్షణ అధికారులు 52 మంది, డిపార్ట్‌మెంటల్ ఆఫీసర్లు 52 మంది, ముగ్గురు స్క్వాడ్ సిబ్బందిని నియమించినట్లు చెప్పారు. మొదటి సంవత్సరం విద్యార్థులు 13,553 మంది, ద్వితీయ సంవత్సరం విద్యార్థులు 10,511 మంది, ప్రైవేట్ విద్యార్థులు 4,335 మంది మొత్తం 28,399 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నట్లు చెప్పారు. ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు పరీక్ష జరుగుతుందన్నారు. విద్యార్థులు పరీక్షా కేంద్రాలకు అరగంట ముందే చేరుకోవాలని సూచించారు. విద్యార్థులకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా ఉండేందుకు పరీక్షాకేంద్రాలలో ఏర్పాట్లు చేశామన్నారు. జిల్లాలో నాలుగు సమస్యాత్మక పరీక్షాకేంద్రాలను గుర్తించామని అక్కడ మరింత పోలీసు బందోబస్తు మధ్య పరీక్ష నిర్వహణ ఉంటుందన్నారు.

మల్లన్న హుండీ ఆదాయం రూ.5.62 కోట్లు



హుండీ ఆదాయాన్ని లెక్కిస్తున్న శివసేవకులు, అధికారులు

శ్రీశైలం, ఫిబ్రవరి 28: శ్రీశైల మహాక్షేత్రంలో భ్రమరాంబ మల్లికార్జున స్వామిఅమ్మవార్లకు భక్తులు సమర్పించిన కానుకలను బుధవారం లెక్కించారు. లెక్కింపులో ఆలయ హుండీల ద్వారా రూ.5.62,30,472 నగదు రూపంలో రాబడిగా లభించింది. ఈ హుండీ ఆదాయాన్ని భక్తులు గడిచిన 49 రోజుల్లో సమర్పించారు. నగదుతో పాటు 39.88 తులాల బంగారు, 7.950 కిలోల వెండి లభించాయి. అదేవిధంగా 1,989 యూఎస్ఏ డాలర్లు, 30 ఆస్ట్రేలియా డాలర్లు, 30 యూఏఈ దిర్హామ్స్, 305 కెనడా డాలర్లు, 25 ఇంగ్లాండ్ ఫౌండ్స్, 56 సింగపూర్ డాలర్లు, 10 కువైట్ దినార్స్ మొదలైన విదేశీ కరెన్సీ ఈ హుండీ లెక్కింపులో లభించాయి. పటిష్టమైన భద్రతా, సీసీ కెమెరాలు, అధికారుల పర్యవేక్షణలో ఈ హుండీ లెక్కింపును నిర్వహించారు. ఈ హుండీ లెక్కింపులో అన్ని విభాగాల అధిపతులు, పర్యవేక్షకులు, సిబ్బంది, శివసేవకులు తదితరులు పాల్గొన్నారు.

ఓటు హక్కును స్వచ్ఛందంగా వినియోగించుకోవాలి

ఎస్పీ రఘువీర్ రెడ్డి



రామకృష్ణాపురంలో గ్రామ సభలో మాట్లాడుతున్న ఎస్పీ

అవుకు, ఫిబ్రవరి 28: ప్రజలు ఓటు హక్కును స్వచ్ఛందంగా వినియోగించుకోవాలని ఎస్పీ రఘువీర్ రెడ్డి అన్నారు. బుధవారం డోన్ డీఎస్పీ శ్రీనివాస్ రెడ్డి, బనగానపల్లె సీఐ తిమ్మారెడ్డి, అవుకు ఎస్ఐ కిరణ్‌తో కలిసి చెర్లోపల్లి గ్రామస్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ రఘువీర్ రెడ్డి మాట్లాడుతూ జిల్లాలోని సమస్యాత్మక గ్రామాలపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. చెర్లోపల్లె సమస్యాత్మక గ్రామం కావడంతో ముందస్తుగా ప్రజలతో ఎన్నికలపై ముఖాముఖీ సమావేశం నిర్వహించామని తెలిపారు. ఆళ్లగడ్డ, బనగానపల్లెలకు ఫ్యాక్షన్ ఏరియాల ముద్ర తొలిగిపోవాలన్నారు. రాజకీయ నాయకులు ఎన్నికల నిబంధనల ప్రకారం ప్రచారం చేసుకోవాలన్నారు. మార్చి 1వ తేదీ నుంచి నియోజకవర్గంలోని సెంట్రల్ పారా మిలిటరీ ఫోర్సు దిగుతుందని తెలిపారు. ఓటర్లను ఎవరైనా బెదిరిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఘర్షణలు జరిగే అవకాశాలు ఉన్నట్లయితే 100కు ఫోన్ చేయాలని సూచించారు. గతంలో కేసులు ఉన్న వ్యక్తులపై బైండోవర్ కేసులు నమోదు చేస్తామన్నారు. చెర్లోపల్లి గ్రామాన్ని దత్తత తీసుకుంటున్నామని తెలిపారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి

బనగానపల్లె, ఫిబ్రవరి 28: సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని ఎస్పీ రఘువీర్‌రెడ్డి అన్నారు. బుధవారం రాత్రి నందివర్గం పోలీస్‌స్టేషన్ పరిధిలోని రామకృష్ణాపురంలో రాత్రి గ్రామ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ పొలాలకు సంబంధించి ఏవైనా సమస్యలు ఉంటే గొడవలకు దిగకుండా ప్రశాంతంగా పరిష్కరించుకోవాలని సూచించారు. ఉద్యోగాలు ఇప్పిస్తామని మోసం చేసేవారు అధికంగా ఉంటారని, మాయమాటలను నమ్మి మోసపోవద్దన్నారు. మద్యం సేవించి డ్రైవింగ్ చేయరాన్నారు. కార్యక్రమంలో డోన్ డీఎస్పీ శ్రీనివాసరెడ్డి, బనగానపల్లె ఎస్ఐ తిమ్మారెడ్డి, నందివర్గం ఎస్ఐ తిరుపాలు రులు పాల్గొన్నారు.

దుర్మార్గ పాలనకు అంతిమ ఘడియలు

- టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యుడు ఎన్ఎండీ ఫరూక్



నంద్యాల (నూనెపల్లె), ఫిబ్రవరి 28: రాష్ట్రంలో దుర్మార్గపు పాలన సాగిస్తున్న జగన్ ప్రభుత్వానికి అంతిమ ఘడియలు దగ్గర పడ్డాయని టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యుడు, నంద్యాల నియోజక వర్గ ఇన్‌చార్జి ఎన్ఎండీ ఫరూక్ ధ్వజమెత్తారు. బుధవారం ఖలీల్ థియేటర్ ఆవరణలోని టీడీపీ కార్యాలయంలో ఆయన మాట్లాడారు. టీడీపీ జిల్లా అధ్యక్షుడు మల్లెల రాజశేఖర్‌పై అక్రమ కేసులు బనాయించి ఓర్వకల్లు పోలీస్ స్టేషన్‌లో రౌడీషీట్‌ను తెరవడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. ప్రభుత్వ పాలనా వైఫల్యాలను ప్రశ్నిస్తే అక్రమ కేసులు బనాయించడం, అరెస్టు చేయడం జగన్ ప్రభుత్వానికి పరిపాటిగా మారిందన్నారు. అన్ని వ్యవస్థలను భ్రష్టు పట్టించిన ఘనత జగన్‌కే దక్కుతుందన్నారు. సైకో పాలనను తరిమికొట్టేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. మల్లెల రాజశేఖర్‌పై రౌడీషీట్‌ను కక్ష పూరిత ధోరణితో తెరిచారని, న్యాయస్థానాన్ని ఆశ్రయిస్తామని ఫరూక్ చెప్పారు.

'మహా'వేడుకలకు సర్వం సిద్ధం

- రేపటి నుంచి శ్రీశైలంలో శివరాత్రి ఉత్సవాలు
- 8న పాగాలంకరణ, కల్యాణోత్సవం
- భారీగా తరలిరానున్న భక్తులు



శ్రీశైలం, ఫిబ్రవరి 28: ఇల కైలాసంగా భావించే శ్రీశైలంలో మహాశివరాత్రి సందర్భంగా నిర్వహించే బ్రహ్మోత్సవాలు శుక్రవారం నుంచి ప్రారంభం కానున్నాయి. స్వామివారి యాగశాల ప్రవేశంతో బ్రహ్మోత్సవాలు ప్రారంభమవుతాయి. పదకొండు రోజుల పాటు నిర్వహించే బ్రహ్మోత్సవాలలో స్వామి అమ్మవార్లకు వివిధ సేవలు నిర్వహిస్తారు. ఈ ఉత్సవాలను తిలకించేందుకు రెండు తెలుగు రాష్ట్రాల నుంచే కాకుండా, కర్ణాటక, తమిళనాడు, మహారాష్ట్ర తదితర రాష్ట్రాల నుంచి లక్షలాదిగా భక్తులు తరలిరానున్నారు. 41 రోజుల పాటు కఠోర దీక్షను కొనసాగించిన శివస్వాములు శివరాత్రి సందర్భంగా దీక్షలను విరమిస్తారు.

కన్నుల పండువగా..

శ్రీశైలంలో ప్రతి ఏటా రెండు పర్యాయాలు బ్రహ్మోత్సవాలను నిర్వహిస్తారు. సంక్రాంతి సందర్భంగా మొదటిసారి, శివరాత్రి సందర్భంగా మరోసారి నిర్వహిస్తారు. మాఘమాసంలో శివరాత్రి సందర్భంగా వచ్చే బ్రహ్మోత్సవాలు ప్రత్యేకం. శివరాత్రి శివుడికి ఇష్టమైన దినంగా భావిస్తారు. అలాంటి సమయంలో స్వామివారి సన్నిధిలో ఉంటూ, ఉపవాస దీక్ష, జాగరణ చేస్తే కైలాస ప్రాప్తి కలుగుతుందని భక్తుల నమ్మకం. అందుకే శివరాత్రికి భక్తులు భారీగా శ్రీశైలానికి తరలివస్తారు. బ్రహ్మోత్సవాల్లో భాగంగా తొలిరోజున సాయంత్రం ధ్వజారోహణ, భేరిపూజ చేసి దేవతలను ఆహ్వానించి ఉత్సవాలను ప్రారంభిస్తారు. తర్వాతి రోజు నుంచి స్వామి అమ్మవార్లకు రోజుకో వాహనసేవను నిర్వహిస్తారు. మహా శివరాత్రి రోజున సాయంత్రం స్వామిఅమ్మవార్లకు ప్రభోత్సవం, రాత్రి లింగోద్భవ సమయంలో మహాన్యాస పూర్వక మహా రుద్రాభిషేకం నిర్వహిస్తారు. ఇదే సమయంలో స్వామివారికి పాగాలంకరణ కార్యక్రమం కూడా జరుగుతుంది. ఈ సమయంలో ప్రదాన ఆలయం లోపల విద్యుత్ సరఫరాను నిలిపివేస్తారు.

వివిధ ఆలయాల నుంచి పట్టు వస్త్రాలు

బ్రహ్మత్సవాల సందర్భంగా స్వామి అమ్మవార్లకు వివిధ దేవస్థానాల నుంచి పట్టు వస్త్రాలను సమర్పిస్తారు. బ్రహ్మోత్సవాలు ప్రారంభమైన మొదటి రోజు శ్రీకాళహస్తీశ్వర దేవస్థానం, 2న ద్వారకా తిరుమల వేంకటేశ్వరస్వామి ఆలయం, 3న విజయవాడ దుర్గా మల్లేశ్వర స్వామి, 4న కాణిపాకం వరసిద్ధి వినాయక స్వామి, అదే రోజు సాయంత్రం తిరుమల తిరుపతి దేవస్థానం నుంచి పట్టువస్త్రాలు సమర్పిస్తారు. ఐదో తేదీన రాష్ట్ర ప్రభుత్వం స్వామి అమ్మవార్లకు పట్టు వస్త్రాలు సమర్పించనుంది.

దారులన్నీ శ్రీశైలం వైపే..

ఇప్పటికే శ్రీశైలానికి శివ భక్తుల రాక మొదలైంది. దీక్షలు ఆచరించి, ఇరుముడి నెత్తిన పెట్టుకుని శ్రీగిరి వైపు సాగుతున్నారు. శివభక్తుల శివనామస్మరణతో దట్టమైన అటవీ ప్రాంతం సందడిని సంతరించుకుంది. వెంకటాపురం, భైర్లూటి నాగలూటి, భీముని కొలను, కైలాసద్వారం మీదుగా పాదయాత్రగా శ్రీశైలానికి చేరుకుంటారు. ఈ సారి స్వామి అమ్మవార్ల దర్శనానికి దాదాపు 8 లక్షల మందికి పైగా భక్తులు వస్తారని అంచనా!



పుణ్యస్నానాలు ఆచరిస్తున్న భక్తులు





ముఖ్య కార్యక్రమాలు ఇలా..

1వ తేదీ, శుక్రవారం	ధ్వజారోహణ
2వ తేదీ, శనివారం	భృంగివాహనసేవ
3వ తేదీ, ఆదివారం	హంసవాహనసేవ
4వ తేదీ, సోమవారం	మయూరవాహనసేవ
5వ తేదీ, మంగళవారం	రావణవాహనసేవ
6వ తేదీ, బుధవారం	పుష్ప పల్లకి
7వ తేదీ, గురువారం	గజవాహనసేవ
8వ తేదీ, శుక్రవారం	పాగాలంకరణ, కల్యాణోత్సవం
9వ తేదీ, శనివారం	రథోత్సవం, తెప్పోత్సవం
10వ తేదీ, ఆదివారం	యాగపూర్ణాహుతి, ధ్వజావరోహణ
11వ తేదీ, సోమవారం	అశ్వవాహనసేవ, శయనోత్సవం

గవర్నర్‌కు ఆహ్వానం



గవర్నర్‌కు ఆహ్వాన పత్రిక అందజేస్తున్న చైర్మన్, ఈఓ

శ్రీశైలం మహాక్షేత్రంలో జరిగే మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలకు రావాలంటూ రాష్ట్ర గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్‌ను ఆలయ ఈఓ పెద్దిరాజు, పాలకమండలి చైర్మన్ రెడ్డివారి చక్రపాణి రెడ్డి బుధవారం ఆహ్వానం పలికారు. ఈ మేరకు వారు రాజ్‌భవన్‌లో గవర్నర్‌ను కలిసి స్వామివార్ల శేషవస్త్రం, ప్రసాదాలతో పాటు ఆహ్వానపత్రికను అందజేశారు.

కంచి కామకోటి పీఠాధిపతికి స్వాగతం

పార్వేట ఉత్సవమూర్తులకు ప్రత్యేక పూజలు

రుద్రవరం, ఫిబ్రవరి 28 : రుద్రవరంలో కంచి కామకోటి పీఠాధిపతి జయేంద్ర సరస్వతికి బుధవారం అహోబిళం దేవస్థానం మఠం టీపీఎస్ సంపత్, ప్రధాన అర్చకులు వేణుగోపాలన్‌కు పూర్ణ కుంభంతో స్వాగతం పలికారు. రుద్రవరంలో పార్వేట పల్లకీలో కొలువుదీరిన జ్వాలా లక్ష్మీనరసింహస్వామి, ప్రహ్లాద వరదస్వాములకు కంచి కామకోటి పీఠాధిపతి జయేంద్ర సరస్వతి వస్త్రాలు సమర్పించి ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో అర్చకులు సౌమ్యనారాయణ్, శ్రీవత్స, మధు తదితరులు పాల్గొన్నారు.



రుద్రవరంలో కంచి కామకోటి పీఠాధిపతి జయేంద్ర సరస్వతికి స్వాగతం పలుకుతున్న అర్చకులు

పీఎం కిసాన్ పథకం కింద 47.06 కోట్లు జమ: జేసీ

నంద్యాల (కల్చరల్), ఫిబ్రవరి 28: వైఎస్సార్ రైతు భరోసా-పీఎం కిసాన్ పథకం కింద జిల్లా వ్యాప్తంగా అర్హులైన 2,34,151 మంది రైతులకు రూ.47.06 కోట్ల రూపాయల లబ్ధి చేకూరిందని జాయింట్ కలెక్టర్ రాహుల్ కుమార్‌రెడ్డి తెలిపారు. అలాగే జిల్లా వ్యాప్తంగా సున్నా వడ్డీ కింది 25,029 మంది రైతులకు రూ.11.08 కోట్ల రూపాయలు లబ్ధి చేకూరిందని చెప్పారు. వైయస్సార్ రైతు భరోసా-పీఎం కిసాన్ పథకం కింద జిల్లాలో ఇప్పటి వరకు 1,426 కోట్ల రూపాయల లబ్ధి రైతులకు చేకూరిందని జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ వంగాల భరత్‌కుమార్ రెడ్డి పేర్కొన్నారు. బుధవారం ముఖ్యమంత్రి క్యాంపు కార్యాలయం నుంచి రాష్ట్రంలోని 53.58 లక్షల మంది రైతులకు ఐదో ఏడాది మూడో విడతలో పీఎం కిసాన్ కింద ఒక్కొక్కరికి రెండు వేల చొప్పున రూ.1,078.36 కోట్ల రూపాయల ఆర్థిక సాయం అందించినట్లు తెలిపారు. అట్లాగే వైయస్సార్ సున్నా వడ్డీ కార్యక్రమంలో భాగంగా 10.78 లక్షల మంది రైతులకు రూ.215.98 కోట్ల వడ్డీ రాయితీని నేరుగా రైతుల ఖాతాలో జమ చేసినట్లు తెలిపారు. కార్యక్రమాన్ని కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి ఉమ్మడి జిల్లాల జిల్లా పరిషత్ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి, వ్యవసాయ సలహామండలి చైర్మన్ భరత్‌కుమార్ రెడ్డి, జేసీ రాహుల్ కుమార్‌రెడ్డి వీక్షించారు. అనంతరం రైతులకు రైతు భరోసా, వైయస్సార్ సున్నా వడ్డీ పంట రుణాల చెక్కును అందజేశారు.

పదిలో వంద శాతం ఉత్తీర్ణతే లక్ష్యం

కేజీబీవీని తనిఖీ చేసిన సమగ్ర శిక్ష రాష్ట్ర జాయింట్ సెక్రెటరీ

ఆదోని (అగ్రికల్చర్), ఫిబ్రవరి 28: కేజీబీవీ పాఠశాలల్లో పదో తరగతి విద్యార్థులు 100 శాతం ఉత్తీర్ణత సాధించడమే లక్ష్యంగా కృషి చేయాలని సమగ్ర శిక్ష రాష్ట్ర జాయింట్ సెక్రటరీ గీత అన్నారు. మంగళవారం రాత్రి ఆదోని పట్టణంలోని వైయస్సార్ నగర్‌లో ఉన్న కేజీబీవీ జనరల్ విద్యాలయాన్ని రాత్రి ఆమె అకస్మికంగా జీసీడీవో సునీతతో కలిసి తనిఖీ చేశారు. పాఠశాలలో అందుతున్న సౌకర్యాల గురించి విద్యార్థినిలను అడిగి తెలుసుకున్నారు. మెనూ ప్రకారం వడ్డిస్తున్నారా...? లేదా అని ఆరా తీశారు. వంట గదిలో సామగ్రిని, రికార్డులను క్షణ్ణంగా తనిఖీ చేశారు. అనంతరం పది, ఇంటర్మీడియట్ విద్యార్థులకు పరీక్షలపై అవగాహన కల్పించారు. పంచతంత్ర యాక్షన్ ప్లాన్ తెలియజేశారు. ఆడపిల్లలకు చదువు ప్రాముఖ్యత వివరించారు. ఉపాధ్యాయులతో సమావేశమై పలు సూచనలు చేశారు. ఆమె వెంట ప్రిన్సిపాల్ శాంతి ఉన్నారు.

ఆర్‌యూ విధుల్లోకి ఉద్యోగులు

నియామక పత్రాలు అందజేసిన వీసీ

కర్నూలు(అర్బన్), ఫిబ్రవరి 28: గత ఏడాది నకిలీ సర్టిఫికెట్ల ఆరోపణలతో తొలగించిన ఇద్దరు ఉద్యోగులను తిరిగి విధుల్లోకి తీసుకున్నట్లు రిజిస్ట్రార్ నాగుల అంకన్న తెలిపారు. బుధవారం రాయలసీమ యూనివర్సిటీలోని ఉపకులపతి చేతుల మీదుగా టైమ్ స్కేల్ ఉద్యోగులైన బి. బాబు, బీ. లక్ష్మీదేవిలకు నియామకపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉద్యోగులు కోర్టును ఆశ్రయించగా న్యాయస్థానం ఆదేశాల మేరకు ధ్రువపత్రాలను పరిశీలనలో సరైనవేనని నిర్ధారణ కావడంతో విధుల్లోకి తీసుకున్నట్లు తెలిపారు. ఉపకులపతి మానవతా దృక్పథంతో స్పందించిన తీరు ఉద్యోగులకు న్యాయం జరిగిందని నాన్ టీచింగ్ ఉద్యోగుల సంఘం నాయకులు సురేంద్ర హర్షం వ్యక్తం చేశారు.

ఇంటర్ పరీక్షలకు సర్వం సిద్ధం

- ఒక నిమిషం ఆలస్యమైనా నో ఎంట్రీ
- టోల్‌ఫ్రీ నెంబర్ 08518-222047

కర్నూలు(ఎడ్యుకేషన్), ఫిబ్రవరి 28: మార్చి 1వ తేదీ నుంచి ప్రారంభమయ్యే ఇంటర్మీడియట్ ప్రథమ, ద్వితీయ సంవత్సరం పబ్లిక్ పరీక్షలకు అన్ని ఏర్పాట్లు చేసినట్లు జిల్లా కన్వీనర్ ఆర్ఐవో ఎస్‌వీఎస్ గురువయ్యశెట్టి తెలిపారు. బుధవారం స్థానిక కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ జిల్లాలో 166 కళాశాలల నుంచి ఇంటర్ విద్యార్థులు 47,412 మంది పరీక్షలకు హాజరవుతున్నారని తెలిపారు. ఇందులో ప్రథమ సంవత్సరం విద్యార్థులు 22,239 మంది కాగా, ద్వితీయ సంవత్సరం విద్యార్థులు 25,173 మంది ఉన్నారన్నారు. ఈ విద్యార్థుల కోసం మొత్తం 69 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. ఈసారి సెల్ఫ్ సెంటర్లు లేవని, అయితే 17 కంబైన్డ్ సెంటర్లను ఏర్పాటు చేశామని అన్నారు. ఈ పరీక్షల్లో 69 మంది చీఫ్ సూపరింటెండెంట్లు, డిపార్టుమెంటల్ ఆఫీసర్లను ఏర్పాటు చేశామన్నారు. 1650 మంది ఇన్విజిలేటర్లు విధుల్లో పాల్గొంటారన్నారు.

నాణ్యమైన స్టేషనరీ, పోలింగ్ సామగ్రిని సరఫరా చేయండి

కర్నూలు(కలెక్టరేట్), ఫిబ్రవరి 28: నాణ్యతతో కూడిన స్టేషనరీ, పోలింగ్ సామగ్రిని సరఫరా చేయాలని జిల్లా కొనుగోలు కమిటీ చైర్మన్, జాయింట్ సెక్రటరీ నారపురెడ్డి మౌర్య టెండర్ ఏజెన్సీలను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్ మినీ కాన్ఫరెన్స్ హాలులో రానున్న సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా 8 అసెంబ్లీ నియోజకవర్గాలకు స్టేషనరీ, పోలింగ్ మెటీరియల్‌ను సరఫరా కోసం టెండర్ ఓపెనింగ్ కార్యక్రమాన్ని జిల్లా కొనుగోలు కమిటీ చైర్మన్, జాయింట్ కలెక్టర్ నిర్వహించారు. ఈ సందర్భంగా జేసీ పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో జిల్లా కొనుగోలు కమిటీ కన్వీనర్ డీఆర్వో మధుసూదన్‌రావు, డ్వామా పీడీ అమర్నాథ్ రెడ్డి, సమాచార పౌర సంబంధాల శాఖ ఉప సంచాలకులు జయమ్మ, పరిశ్రమల శాఖ జీఎం, డిస్ట్రిక్ట్ సప్లయ్ ఆఫీసర్ కేవీఎస్ఎం ప్రసాద్, జిల్లా ఆడిట్ అధికారి రమేష్ పాల్గొన్నారు.

మహిళ ఆత్మహత్యాయత్నం

చాగలమర్రి, ఫిబ్రవరి 28: మండలంలోని శెట్టివీడు గ్రామానికి చెందిన మహేశ్వరి అనే మహిళ ఒంటిపై పెట్రోల్ పోసుకొని నిప్పంటించుకుంది. ఈ ఘటన బుధవారం రాత్రి చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన మహేశ్వరి కొంత కాలంగా క్యాన్సర్‌తో బాధపడుతోంది. జీవితంపై విరక్తి చెందిన ఈ దారుణానికి పాల్పడింది. కుటుంబీకులు 108 వాహనంలో స్థానిక కేరళ వైద్యశాలకు తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో నంద్యాల ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. పోలీసులు జరిగిన సంఘటనపై విచారిస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో వికలాంగుల సంఘం నాయకుడి మృతి

ఆటోలో వెళుతుండగా పత్తికొండ బైపాస్‌లో ప్రమాదం

పత్తికొండ, ఫిబ్రవరి 28 : పత్తికొండ బైపాస్ రోడ్డులో పుచ్చకాయలమాడ క్రాస్‌వద్ద బుధవారం రాత్రి చోటుచేసుకున్న రోడ్డుప్రమాదంలో వికలాంగుల సంఘం నాయకుడు వీరప్రకాష్ (49) మృతి చెందాడు. పత్తికొండ నుండి పుచ్చకాయలమాడ గ్రామానికి ప్రయాణికులతో ఆటో సాయంత్రం బయలుదేరింది. ఆర్టీసీ డిపో దాటి బైపాస్ రోడ్డులో పుచ్చకాయలమాడ క్రాస్ వద్దకు చేరుకోగా.. ట్రాలీలో వ్యవసాయ పనిముట్లతో వెళుతున్న ట్రాక్టర్ ఎదురైంది. ట్రాక్టర్ ట్రాలీ వెనుక వేలాడుతున్న ఇనుప వ్యవసాయ పనిముట్లు ఆటోలో ప్రయాణిస్తున్న ప్రకాష్‌కు తగిలి తలను చీల్చుకుంటూవెళ్లాయి. ఆటోలో ఉన్న పాముల కిష్టన్న చేతివేళ్లు తెగిపోయాయి. మరో ఇద్దరికి స్వల్పగాయాలయ్యాయి. వీరిని పత్తికొండ ఆసుపత్రికి తరలించగా అప్పటికే ప్రకాష్ మృతిచెందినట్లు వైద్యులు తెలిపారు. చేతివేళ్లుతెగిన కిష్టన్నను మెరుగైన చికిత్స కోసం కర్నూలుకు తరలించారు. మృతిచెందిన వీరప్రకాష్ మహాత్మా దివ్యాంగుల ప్రాంతీయసమన్వయ కమిటీ జిల్లా అధ్యక్షుడిగా పనిచేస్తున్నాడు. కిష్టన్న ఉచ్చకాయలమాడలో టీడీపీ కార్యకర్త.

కేఈ శ్యాంబాబు పరామర్శ..

టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి కేఈ శ్యాంబాబు పత్తికొండ ఆసుపత్రికి చేరుకుని మృతిచెందిన వీరప్రకాష్ కుటుంబాన్ని, టీడీపీ కార్యకర్త పాముల కిష్టన్నను పరామర్శించారు. ఆయనతోపాటు పుచ్చకాయలమాడకు చెందిన టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు సాంబశివారెడ్డి, శ్రీధర్‌రెడ్డి ఉన్నారు.

విద్యుదాఘాతంతో యువకుడి మృతి

నంద్యాల క్రైం, ఫిబ్రవరి 28 : నంద్యాల మండలం పోలూరు గ్రామంలో విద్యుదాఘాతంతో ఓ యువకుడు మృతి చెందాడు. పోలూరు గ్రామంలో పూల చిన్న మద్దిలేటి (27) తన ఇంట్లో నీరు పట్టేందుకు సమీపంలోనే ఉన్న కుళాయి నుంచి మోటార్‌కు కనెక్షన్ ఇచ్చాడు. ప్రమాదవశాత్తూ విద్యుదాఘాతంతో మద్దిలేటి మృతి చెందినట్లు పోలీసులు బుధవారం తెలిపారు. మృతుడు చిన్నమద్దిలేటికి వివాహమైనట్లు పేర్కొన్నారు.

నేడు కోసిగి ఎల్లమ్మ రథోత్సవం



కోసిగి, ఫిబ్రవరి 28: కొలిచేవారికి కొంగుబంగారంగా విరాజిల్లుతున్న కోసిగి రేణుకా ఎల్లమ్మ అమ్మవారి రథోత్సవం గురువారం వైభవంగా జరగనుంది. ఈ జాతరకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఆలయ పూజారులు ఉమేష్‌గౌడు, మల్లయ్యగౌడు, చంద్రయ్య గౌడులు తెలిపారు. ఈ రథోత్సవానికి వేలాదిగా భక్తులు తరలి రానున్నారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు జరగకుండా తాగునీరు ఇలా మౌలిక వసతులు కల్పిస్తున్నట్లు కోసిగి మేజర్ గ్రామ సర్పంచ్ కుమారి అయ్యమ్మ తెలిపారు. జాతర సందర్భంగా గట్టి పోలీసు బందోబస్తు ఎమ్మిగనూరు డీఎస్పీ సీతారామయ్య ఆధ్వర్యంలో గట్టి పోలీసు బందోబస్తు ఏర్పాటు చేసినట్లు కోసిగి సీఐ ప్రసాద్, ఎస్ఐ సతీష్ కుమార్ తెలిపారు.





బ్రహ్మోత్సవాలు వైభవంగా నిర్వహిస్తాం

నంద్యాల ఆర్డీఓ మల్లికార్జునరెడ్డి



ఏర్పాట్లపై అధికారులతో మాట్లాడుతున్న ఆర్డీఓ మల్లికార్జునరెడ్డి

మహానంది, ఫిబ్రవరి 28: మహానంది మహా శివరాత్రి బ్రహ్మోత్సవాలను వైభవంగా నిర్వహిస్తామని నంద్యాల ఆర్డీఓ మల్లికార్జున రెడ్డి, ఆలయ ఈవో కాపు చంద్రశేఖర్‌రెడ్డి అన్నారు. బుధవారం సాయంత్రం మహానందిలో మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల ఏర్పాట్లపై వివిధ శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఆర్డీఓ మాట్లాడుతూ బ్రహ్మోత్సవాల్లో భాగంగా క్షేత్రానికి వచ్చే భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పిస్తామని అన్నారు. నంద్యాల డీఎస్పీ రవీంద్రనాథ్ రెడ్డి మాట్లాడుతూ శివరాత్రి సందర్భంగా క్షేత్రానికి వచ్చే భక్తుల కోసం 200 మంది పోలీస్ సిబ్బందితో బందోబస్తు ఏర్పాటు చేసి నిఘా పెంచుతామని తెలిపారు. ఈవో కాపు చంద్రశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ గత ఏడాది కంటే శివరాత్రికి మెరుగైన ఏర్పాట్లు చేస్తున్నట్లు చెప్పారు. మార్చి 8వ తేదీ రాత్రి 10 గంటల నుంచి క్షేత్రంలో జరిగే లింగోద్భవ పుణ్యకాలంలో రూ.100 టిక్కెట్లు విక్రయించి భక్తులకు దర్శనం కల్పిస్తామని చెప్పారు. మహానంది నుండి గాజులపల్లి వైపు వెళ్లే మూడు కిలో మీటర్ల రహదారికి తాత్కాలిక మరమ్మతులు మరో మూడు రోజుల్లో పూర్తి చేస్తామని ఆర్ అండ్‌బీ డీఈఈ సురేష్ తెలిపారు. తమ్మడపల్లి మలుపు వద్ద ఏర్పాటు చేసిన స్పీడు బ్రేకుల వద్ద పెయింటింగ్‌తో గుర్తులు వెయిస్తామని చెప్పారు. నంద్యాల మున్సిపాలిటీ ఇన్‌చార్జి అసిస్టెంట్ కమిషనర్ అంకిరెడ్డి మాట్లాడుతూ మహానందిలో మూడు రోజులపాటు సిబ్బందితో పారిశుధ్య పనుల నిర్వహణతోపాటు దోమల నివారణకు పరిసరాల్లో ఫాగింగ్ చేయిస్తామన్నారు. ఎక్సైజ్‌శాఖ ఎస్ఐ గౌస్‌బాషా మాట్లాడుతూ మహానందిలో మార్చి 8,9,10 తేదీల్లో మూడు రోజుల పాటు ప్రభుత్వ మద్యం షాపును బంద్ చేస్తామని చెప్పారు. కార్యక్రమంలో మండల ట్రాన్స్‌కో ఏఈ ప్రభాకర్‌రెడ్డి, వైద్యాధికారి భగవాన్‌దాస్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ పవన్‌కుమార్, నంద్యాల ఆర్టీసీ డీఎం గంగాధర్, ఇన్‌చార్జి డీఎల్‌పీఓ వెంకటేశ్వరరావు, మండల ఏవో శ్రీనివాసరెడ్డి, మహానంది దేవస్థానం ఏఈఓలు ఎర్రమల్ల మధు, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

రాజకీయ కక్షతోనే మల్లెల రాజశేఖర్‌పై రౌడీషీట్

ఓర్వకల్లు, ఫిబ్రవరి 28: అధికార పార్టీ నాయకుల రాజకీయ కక్షతోనే మాజీ జడ్పీ చైర్మన్, నంద్యాల టీడీపీ అధ్యక్షుడు మల్లెల రాజశేఖర్‌పై రౌడీషీట్ ఓపెన్ చేశారని మాజీ ఎంపీటీసీ నాగరాజు ఆరోపించారు. బుధవారం మండలంలోని హుశేనాపురం గ్రామం నుంచి బైక్, ట్రాక్టర్లు, వాహనాలతో టీడీపీ నాయకులు, కార్యకర్తలు, మహిళలు, అభిమానులు, బీసీ సోదరులు భారీ ర్యాలీగా వచ్చి ఎంపీడీవో కార్యాలయం ఎదురుగా జాతీయ రహదారిని దిగ్బంధించారు. దీంతో రోడ్డుకిరువైపులా భారీ వాహనాలు నిలిచిపోయాయి. మల్లెలపై పెట్టిన రౌడీషీట్‌ను ఎత్తివేయాలని నినాదాలు చేశారు. అనంతరం ఎస్ఐ రాజారెడ్డికి వినతి పత్రం సమర్పించారు. పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి ఎస్ఐతో మాట్లాడారు. ఈ విషయంపై జిల్లా అధికారులతో చర్చించి మల్లెల రాజశేఖర్‌పై పెట్టిన రౌడీషీట్‌ను ఎత్తివేసేందుకు చర్యలు తీసుకుంటామని చెప్పడంతో ఆందోళనకారులు నిరసన కార్యక్రమాన్ని విరమింపజేశారు. ఈ సందర్భంగా పాణ్యం మాజీ ఎమ్మెల్యే గౌరు చరిత రహదారిపై మాట్లాడుతూ రాజశేఖర్‌పై పెట్టిన అక్రమ, రౌడీషీట్‌ను ఎత్తేయాలని కోరారు. ఈ విషయం ఎస్పీ కృష్ణకాంత్ దృష్టికి తీసుకెళ్తామన్నారు. మైనార్టీ నాయకుడు మహబూబ్ బాషా, మాజీ ఎంపీటీసీ నాగరాజు, మండల తెలుగు యువత అధ్యక్షుడు రాము, కాపు సంఘం యువ నాయకుడు కేవీ మధు, కాల్వబుగ్గ మాజీ చైర్మన్ సుధాకర్ మాట్లాడుతూ వైసీపీ నాయకులు కక్షతోనే మల్లెల రాజశేఖర్‌పై రౌడీషీట్ ఓపెన్ చేయించారని అన్నారు. బీసీ వర్గాన్ని అణిచివేసేందుకే ఈ కేసు పెట్టారని అన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ షమీనా, నాయకులు ప్రశాంత్, బజారు, వడ్డె నారాయణ, గడ్డెకారి చంద్రశేఖర్, రజాక్, ఖాదర్, శేఖరప్ప, జయకృష్ణ, రామగోవిందు, రామచంద్రుడు, వెంకటసుబ్బయ్య పాల్గొన్నారు.

జాతీయ రహదారి దిగ్బంధం.. నిలిచిపోయిన వాహనాలు



ధర్నా ముగిశాక టీడీపీ మహిళలతో మాట్లాడుతున్న గౌరు చరిత



జాతీయ రహదారిపై ధర్నా చేస్తున్న టీడీపీ నాయకులు, కార్యకర్తలు

పెళ్లింట విషాదం

రోడ్డు ప్రమాదంలో ఒక్కగానొక్క కుమారుడి మృతి

మద్దికెర, ఫిబ్రవరి 28: తెల్లారితే.. చిన్నాన్న కొడుకుది పెళ్లి.. బంధువులంతా వస్తున్నారు.. ఆ ఇంట శుభకార్యం జరగాల్సి ఉండగా..దూర ప్రాంతాల నుంచి వస్తున్న బంధువులను తీసుకువచ్చేందుకు వెళ్లి రోడ్డు ప్రమాదంలో నవీన్ (25) అనే యువకుడు బుధవారం మృతి చెందాడు. మండలంలోని పెరవలి గ్రామానికి చెందిన వడ్డె రామాంజులు, సుధారాణి దంపతులకు ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. ఒక కుమార్తెకు వివాహం చేశారు. నవీన్ ఒక్కగానొక్క కుమారుడు. నవీన్ పదో తరగతి పూర్తి చేసుకుని బెల్దార్ పనికి వెళ్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. వారి చిన్నాన్న రంగస్వామి కుమారుడు శివశంకర్ పెళ్లి గురువారం పెరవలి గ్రామంలో జరగనుంది. ఈ వివాహానికి బంధువులు గుంతకల్లుకు వస్తుండటంతో వారిని తీసుకురావడానికి మంగళవారం రాత్రి మరో ముగ్గురు మిత్రులతో కలిసి జీపులో నవీన్ గుంతకల్లుకు వెళ్లాడు. పెరవలి గ్రామ శివారులో జీపు టైరు పేలి బోల్తా పడింది. జీపులో ఉన్న నవీన్‌కు తీవ్ర గాయాలు కావడంతో కర్నూలు తరలించారు. మిగతా ముగ్గురుకి స్వల్ప గాయాలు అయ్యాయి. నవీన్ కర్నూలులో చికిత్స పొందుతూ కోలుకోలేక మృతి చెందాడు. నవీన్‌కు వివాహం కాలేదు. ఉన్న ఒక్కగానొక్క కొడుకు తిరిగిరాని లోకాలకు వెళ్లడంతో ఆ కుటుంబంలో విషాద ఛాయలు చోటు చేసుకున్నాయి. నవీన్ మృతి చెందడంతో ఆ ఇంట్లో వివాహం నిలిచిపోయింది. మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.



వడ్డె నవీన్(ఫైల్)



రోధిస్తున్న కుటుంబ సభ్యులు

గురు వైభవ -2024 అవార్డులకు పలువురి ఎంపిక



మాట్లాడుతున్న మంత్రాలయం మఠం ఏఏవో మాధవశెట్టి

మంత్రాలయం, ఫిబ్రవరి 28: గురువైభోత్సవాల్లో భాగంగా మంత్రాలయం రాఘవేంద్రస్వామి మఠం అందజేసే అవార్డులకు పలువురు ప్రముఖులు ఎంపికయ్యారు. ఇందుకు సంబంధించిన వివరాలను మంత్రాలయం మఠం ఏఏఓ మాధవశెట్టి బుధవారం వెల్లడించారు. మార్చి 12వ తేదీన రాఘవేంద్రస్వామి 403వ పట్టాభిషేకం, 16వ తేదీన 429వ రాఘవేంద్రస్వామి జన్మదినోత్సవ వేడుకలను ఆరు రోజుల పాటు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా దేశవ్యాప్తంగా ఉన్న ప్రముఖులకు గురువైభవ అవార్డులను అందజేస్తున్నట్లు తెలిపారు. అవార్డుకు ఎంపికైన వారిలో రాష్ట్ర హైకోర్టు జడ్జిలు జస్టిస్ దుర్గాప్రసాద్‌రావు, జస్టిస్ నరేందర్, జస్టిస్ శ్యాంసుందర్, జస్టిస్ హరినాథ్ నూనెపల్లె, కర్ణాటక హైకోర్టు జడ్జి శాంతిభూషణ్, రిటైర్డు అడ్వకేట్ జనరల్, ప్రభులింగ నావదగి, కర్ణాటక డిప్యూటీ సెక్రటరీ నాగరాజు, ఆకాష్ దొడ్డి, ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కరికాల వలవన్, ఆర్‌అండ్‌బీ స్పెషల్ సెక్రటరీ పీఎస్ ప్రద్యుమ్న, ఎండోమెంట్ కమిషనర్ సత్యనారాయణ, ఎండోమెంట్ హిందూ సంప్రదాయ దేవదాయ కమిషనర్ బసవరాజేంద్ర, కర్నూలు ఎస్పీ జి.కృష్ణకాంత్, విజయనగర జిల్లా ఎస్పీ టీఎల్ శ్రీహరిబాబు, రాయచూరు ఎస్పీ నిఖిల్, టీటీడీ ఈవో ధర్మారెడ్డి, రాజ్యసభ అడిషినల్ సెక్రటరీ సోమశేఖర్, టీటీడీ చైర్మన్ భూమన కరుణాకర్ రెడ్డి ఉన్నారు. వీరితో పాటు కర్ణాటక రాష్ట్రం మైసూరు ఓపెన్ యూనివర్సిటీ వీసీ ప్రొఫెసర్ శరణప్ప, బెంగుళూరు సంస్కృతి యూనివర్సిటీ వీసీ అహల్య, టీటీడీ విద్వాన్ విభూషణ్ శర్మ, మహానంది క్షేత్ర పండితులు విద్వాన్ వెంకట దుర్గ నాగేశ్వరశర్మ, విద్వాన్ రవిశంకర్ అవధాని, విజయవాడ మల్లేశ్వర టెంపుల్ విద్వాన్ విరూపాక్షం సహస్ర మహర్షి, బెంగుళూరు జయసింహ, వీరభన్నాంజే, రవిదేవరాయ సముద్ర, టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సోమిశెట్టి వెంకటేశ్వర్లు, సింగిల్ విండో అధ్యక్షులు ప్రదీప్ రెడ్డి, ఉడిపి మోహన్, ప్రమోద్ కుమార్, ముకుందజీ, అరుణాచార్, మధుసూదన్, యశోదమ్మ, చెన్నైకి చెందిన ప్రమోద్, సురేష్‌గౌడ, సంజీవ అనంతకృష్ణలకు అవార్డులకు ఎంపికయ్యారు. యోగేంద్ర కళామండపంలో ఆరు రోజుల్లో జరిగే వైభోత్సవాల్లో అవార్డులు, ప్రశంసాపత్రం, నగదు, వెండి గిన్నె ఫలపుష్ప మంత్రాక్షింతలు, పరిమళ ప్రసాదం ఇచ్చి సన్మానిస్తున్నట్లు మఠం ఏఏఓ తెలిపారు.

బాలాజీ కాంప్లెక్స్‌లో చోరీ

కందిబ్యాళ్ల యజమాని ఇంట్లో బంగారం, వెండి అపహరణ

కుటుంబ సభ్యులంతా తీర్థయాత్రకు వెళ్లడంతో ఘటన

నంద్యాల క్రైం, ఫిబ్రవరి 28 : నంద్యాల ఒకటో పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలోని బాలాజీ కాంప్లెక్స్‌లో దొంగలు పడ్డారు. కందిబ్యాళ్ల మిల్లు యజమాని గుండా వెంకటేశ్వర్లు ఇంట్లో దొంగలుపడి దోచుకెళ్లారు. వారం క్రితం గుండా వెంకటేశ్వర్లు తన కుటుంబసభ్యులతో కలిసి మధుర క్షేత్రానికి వెళ్లారు. బాలాజీ కాంప్లెక్స్‌లో పక్కాగా రెక్కీ నిర్వహించిన దొంగలు మంగళవారం అర్ధరాత్రి ఇంటి తాళం పగులగొట్టి లోపలికి చొరబడి బీరువాలోని 12 తులాల బంగారం, వెండి కేజీతోపాటు ఇతర విలువైన వస్తువులు దోచుకెళ్లినట్లు తెలుస్తోంది. పక్కింటివారు సమాచారం ఇవ్వడంతో పోలీసులు వెంకటేశ్వర్లు ఇంటికి చేరుకొని దొంగతనం జరిగిన తీరును పరిశీలించారు. ఇంటి యజమాని నంద్యాలకు వస్తే చోరీ పూర్తి వివరాలు వెల్లడి అవుతాయన్నారు. కేసు దర్యాప్తులో ఉన్నట్లు వన్‌టౌన్ పోలీసులు తెలిపారు.

మార్క్‌ఫెడ్ ద్వారా శనగలు కొనుగోలు

నంద్యాల టౌన్, ఫిబ్రవరి 28 : మార్క్‌ఫెడ్ ద్వారా రైతుల నుంచి మద్దతు ధరతో శనగలను కొనుగోలు చేసేందుకు ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. 2023-2024 సంవత్సరం రబీలో సాగు చేసిన శనగ దిగుబడికి మద్దతు క్వింటం ధర రూ.5,440 చెల్లించి రైతుల నుంచి కొనుగోలు చేసేందుకు ఆదేశించారు. జిల్లాలోని ఈ క్రాప్, ఈ కేవైసీ చేయించుకున్న శనగ రైతులందరూ తమ సమీపంలోని రైతు భరోసా కేంద్రాలలో తమ పేర్లను నమోదు చేయించుకొని మద్దతు ధరకు శనగలు అమ్ముకోవాలని వ్యవసాయాధికారులు తెలిపారు. రైతుల నుంచి నాణ్యత ప్రమాణాలు కలిగిన శనగలను మాత్రమే కొంటామని మార్క్‌ఫెడ్ అధికారులు వెల్లడించారు.

గ్రావెల్ తవ్వుతున్న వారిపై కేసు

టిప్పర్లు సీజ్ చేసిన అధికారులు

కర్నూలు(అర్బన్), ఫిబ్రవరి 28: కల్లూరు మండలం పరిధిలో తడకనపల్లె సమీపంలో అక్రమంగా గ్రావెల్ తవ్వుతున్న వ్యక్తులపై కేసులు చేశామని గనుల శాఖ డిప్యూటీ డైరెక్టర్ రాజశేఖర్ తెలిపారు. బుధవారం పలు చోట్ల ఆకస్మిక తనిఖీలు నిర్వహించి 5 టిప్పర్లను సీజ్ చేశామని తెలిపారు. సీజ్ చేసిన వాటిని ఉలిందకొండ, కర్నూలు తాలుకా పోలీస్‌స్టేషన్‌లలో ఉంచామన్నారు. ఈ తనిఖీల్లో విజిలెన్స్ ఏడీ బైరాగి నాయుడు, రాయల్టీ ఇన్‌స్పెక్టర్ మురహరి, టెక్నికల్ ఇన్‌స్పెక్టర్ దీలీప్ తదితరులు పాల్గొన్నారని తెలిపారు.

టీజీ వెంకటేశ్‌కు మాతృవియోగం



గౌరమ్మకు నివాళులర్పిస్తున్న టీజీ వెంకటేశ్ కుటుంబ సభ్యులు

కర్నూలు(కల్చరల్), ఫిబ్రవరి 28: రాజ్యసభ మాజీ సభ్యుడు టీజీ వెంకటేశ్ మాతృమూర్తి టీజీ గౌరమ్మ (96) గురువారం తెల్లవారుజామున 5.20 గంటలకు కాలధర్మం చెందారు. కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆమె కోలుకోలేక నగరంలోని గౌరి గోపాల్ ఆసుపత్రిలో తుది శ్వాస విడిచారు. ఆమె మరణవార్త తెలుసుకున్న టీజీ కుటుంబం కన్నీటి పర్యంతమయ్యారు. విషయం తెలుసుకొని జిల్లాలోని ప్రముఖులు, వివిధ పార్టీల నేతలు, ప్రజలు పెద్ద సంఖ్యలో నగరంలోని సంకల్‌బాగ్‌లోగల టీజీ వెంకటేశ్ నివాసానికి చేరుకున్నారు. ఆమెకు నివాళులు అర్పించారు. మాజీ ఎమ్మెల్యేలు ఎస్వీ మోహన్‌రెడ్డి, మీనాక్షినాయుడు, కేడీసీసీ బ్యాంకు చైర్మన్ ఎస్వీ విజయమనోహరి, టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సోమిశెట్టి వెంకటేశ్వర్లు, కోట్ల సుజాతమ్మ, ఎదురూరు విష్ణువర్ధన్‌రెడ్డి, బీజేపీ రాష్ట్ర నాయకుడు విష్ణువర్ధన్‌రెడ్డి, బీజేపీ, టీడీపీ, కాంగ్రెస్, వైసీపీ, సీపీఐకి చెందిన జిల్లా, రాష్ట్ర నాయకులు, స్థానిక కార్పొరేటర్లు, వివిధ ప్రజా సంఘాల నేతలు, టీజీవీ గ్రూప్ ఆఫ్ కంపెనీస్ ఉద్యోగులు, టీజీ వెంకటేశ్ బంధువులు, మిత్రులు నివాళులు అర్పించారు. పలువురు టీజీ వెంకటేశ్, కర్నూలు టీడీపీ అభ్యర్థి టీజీ భరత్‌లను కలిసి ఓదార్చారు.



విషాదవదనంలో టీజీ వెంకటేశ్, కర్నూలు టీడీపీ అభ్యర్థి టీజీ భరత్, కుటుంబ సభ్యులు



నివాళులర్పిస్తున్న ఎస్వీ మోహన్‌రెడ్డి దంపతులు

నంద్యాల

నంద్యాల, నందికొట్కూరు, శ్రీశైలం, పాణ్యం

జగన్‌ను నమ్మి మళ్లీ మోసపోకండి: బుడ్డా



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖరరెడ్డి

ఆత్మకూరు, ఫిబ్రవరి 28: రాష్ట్రంలో టీడీపీతోనే యువతకు భవిష్యత్ ఉంటుందని, సీఎం జగన్‌ను నమ్మి మళ్లీ మోసపోవద్దని శ్రీశైలం మాజీ ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖరరెడ్డి సూచించారు. ఆత్మకూరు శ్రీవెంకటేశ్వర డిగ్రీ కళాశాలలో బుధవారం 'మై ఫస్ట్ ఓట్ ఫర్ సీబీఎన్' సదస్సును నిర్వహించారు. బుడ్డా మాట్లాడుతూ.. కొత్తగా ఓటు నమోదు చేసుకున్న యువతకు తొలిసారి వినియోగించుకునే ఓటు హక్కు జీవితంలో మరచిపోలేనిదిగా ఉండాలన్నారు. అంతటి విలువైన ఓటు హక్కును రాష్ట్రానికి భవిష్యత్‌ను ఇచ్చే వ్యక్తులను ఎంచుకుని ఉపయోగించుకోవడం మన కర్తవ్యమని వివరించారు. వైసీపీ పాలనతో రాష్ట్రంలోని అన్నివర్గాలు సర్వనాశనమయ్యాయని, అందులో ప్రత్యేక యువత భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఐదేళ్లలోనే సుమారు రూ.10లక్షల కోట్ల అప్పులు తెచ్చి రాష్ట్రాన్ని అప్పులమయంగా మార్చేశారని చెప్పారు. జగన్ అరాచక విధానాలు నచ్చక ఏ ఒక్క పరిశ్రమ కూడా రాష్ట్రానికి రాలేదని, ఉన్నత పరిశ్రమలు సైతం రాష్ట్రాన్ని వదిలి వెళ్లాల్సిన స్థితికి తీసుకొచ్చారని అన్నారు. కార్యక్రమంలో 'మై ఫస్ట్ ఓట్ ఫర్ సీబీఎన్' కార్యక్రమ జిల్లా కోఆర్డినేటర్ భూమా జగత్ విఖ్యాత రెడ్డి, నాయకులు బన్నూరు రామలింగారెడ్డి, శివప్రసాద్‌రెడ్డి, వేణుగోపాల్, మల్లేశ్వరరెడ్డి, కొప్పరపు రవిప్రసాద్, రాజారెడ్డి, పస్పీల్ మున్నా, సతీష్, శ్రీకాంత్‌గౌడ్, ఆరీఫ్ తదితరులు ఉన్నారు.

'రాష్ట్రంలో రాక్షస పాలన'


నందికొట్కూరులో ప్రచారం చేస్తున్న టీడీపీ నాయకులు

నందికొట్కూరు, ఫిబ్రవరి 28: రాష్ట్రంలో రాక్షస పాలన కొనసాగుతోందని టీడీపీ ఎస్సీ సెల్ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ జయసూర్య ఆరోపించారు. పట్టణంలోని 16వ వార్డులో బుధవారం టీడీపీ నాయకులు శ్రీకాంత్ గౌడ్, లింగమయ్య ఆధ్వర్యంలో 'బాబు ష్యూరిటీ.. భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. నాయకులు ఇంటింటికి వెళ్లి టీడీపీ మినీ మేనిఫెస్టో గురించి వివరించారు. సీఎం జగన్‌ను ఇంటికి పంపేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. అనంతరం మినీ మేనిఫెస్టో కరపత్రాలను అందజేశారు. మాండ్ర సురేంద్రనాథ్‌రెడ్డి, భాస్కర్‌రెడ్డి, ముర్తుజావలి, జాకీర్, షకీల్ అహ్మద్, హుసేన్, శాంతరాజు, మల్లికార్జునరెడ్డి, సత్తార్ మియ్యా, రాజు, రాజన్న, వేణుగోపాల్, ఉపేంద్ర తదితరులు పాల్గొన్నారు.

'ఎస్సీ వర్గీకరణ బిల్లు కమిటీని రద్దు చేయాలి'


అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేస్తున్న నాయకులు

పాములపాడు, ఫిబ్రవరి 28: ప్రదాని మోదీ ప్రవేశ పెట్టిన ఎస్సీ వర్గీకరణ బిల్లు కమిటీని రద్దు చేయాలని జాతీయ మాలమహానాడు రాయలసీమ అధ్యక్షుడు నలమల అబ్రహం, నాయకులు అంకన్న, నాగరాజు డిమాండ్ చేశారు. బుధవారం పాములపాడులోని అంబేడ్కర్ సర్కిల్ వద్ద నాయకులు నినాదాలు చేశారు. నాయకులు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎస్సీ ఏబీసీడీ వర్గీకరణకు మద్దతు తెలిపి కమిటీనీ ఏర్పాటు చేయడం అన్యాయమన్నారు. అంబేడ్కర్ భారత రాజ్యంగంలో ఎస్సీ మాల మాదిగలు సోదర భావంతో కలసి మెలసి ఉండేల రిజర్వేషన్లు కల్పిస్తే నేటి పాలకులు స్వార్థ రాజకీయాల కోసం విడదీసి కులాల మధ్య చిచ్చు పెడుతున్నారని మండిపడ్డారు. వచ్చే ఎన్నికల్లో బీజేపీకి గుణపాఠం చెబుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో మాల మహానాడు నాయకులు శ్రీకాంత్, శెట్టి శివలింగం, సుధాకర్, జగన్, దరగయ్య, జక్కి, లాజర్, గోవిందు, రాజశేఖర్, సుంకన్న తదితరులు పాల్గొన్నారు.

తపాలా కార్యాలయం తనిఖీ

పాములపాడు, ఫిబ్రవరి 28: పాములపాడులోని తపాలా కార్యాలయాన్ని బుధవారం కర్నూలు రీజియన్ అసిస్టెంట్ డైరెక్టర్ సేమతుల్లా ఆకస్మికంగా తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ తపాలా కార్యాలయంలో పొదుపు ఖాతాలు, ఇన్సూరెన్స్ పాలసీలు, పోస్టు బ్యాంకులు తదితర పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఇంటింటా పొదుపు పంట అనే కార్యక్రమం నిర్వహించి, ప్రతి ఒక్కరూ సేవింగ్స్ ఖాతాలను, పోస్టల్ ఇన్సూరెన్స్ పాలసీల ఖాతాలను ప్రారంభించి ప్రయోజనాలను పొందాలన్నారు. కార్యక్రమంలో పోస్టుమాస్టర్ ఖాజా మోహిద్దీన్, పోస్టల్ సిబ్బంది పాల్గొన్నారు.

యువకుడి ఆత్మహత్యాయత్నం

నంద్యాల క్రైం, ఫిబ్రవరి 28: పట్టణంలోని ఇస్లాంపేటకు చెందిన అలిబాషా అనే యువకుడు బుధవారం ఫ్యాన్‌కు తాడుతో ఉరివేసుకొని ఆత్మహత్యాయత్నం చేసినట్లు త్రీ టౌన్ పోలీసులు తెలిపారు. మీ ఇంట్లో మూడు అడుగుల స్థలం తమదని ఇస్లాంపేటలో నివాసం ఉంటున్న అలి బాషా పక్కింటి వారు బెదిరించేవారు. దీంతో వేధింపులు తాళలేక బుధ వారం ఇంట్లో ఫ్యాన్‌కు ఉరివేసుకొని ఆత్మహత్యాయ ఎత్నానికి పాల్పడ్డాడు. కుటుంబ సభ్యులు గమనించి వెంటనే అలిబాషాను నంద్యాల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

విజేతలకు బహుమతి ప్రదానం

ఆత్మకూరు, ఫిబ్రవరి 28: పదో తరగతి పబ్లిక్ పరీక్షలకు సిద్ధమయ్యే విద్యార్థులకు ఎస్‌ఎఫ్‌ఐ ఆధ్వర్యంలో ఈ నెల 6వ తేదిన నిర్వహించిన ప్రజ్ఞా వికాస పరీక్షలో ప్రతిభ కనబర్చిన విజేతలకు బుధవారం ఆ సంఘం పట్టణ కార్యదర్శి దినేష్ కుమార్ బహుమతులు ప్రదానం చేశారు. ఆయన మాట్లాడుతూ పది పబ్లిక్ పరీక్షలు రాసే విద్యార్థులు ఎలాంటి ఒత్తిడి లోనవ్వకుండా నిర్దేశించిన పరీక్షా సమయాన్ని వినియోగించుకోవాలని సూచించారు. ప్రత్యేకించి ప్రశ్నాపత్రంలో తమకు వచ్చిన జవాబులు ఆలస్యం రాయాలని చెప్పారు. స్క్వాడ్ టీంలు వచ్చిన సందర్భంలో కూడా ఆందోళన చెందకుండా పరీక్షలు రాసుకోవాలని వివరించారు. ప్రత్యేకించి మార్చి 18 నుంచి పది పరీక్షలు ప్రారంభం కానున్నాయని, ప్రణాళిక చదివితే చక్కటి మార్కులు సాధించేందుకు అవకాశం వుంటుందని తెలిపారు. పరీక్షల ముందు విలువైన సమయాన్ని వృథా చేయకుండా విద్యార్థులు ముందుకు సాగాలని ఆకాంక్షించారు. అదేవిధంగా పది పరీక్షలు రాసే విద్యార్థులకు ఏపీఎస్ఆర్టీసీ వారు ఉచిత బస్సు సదుపాయాన్ని కల్పించడం జరిగిందని, హాల్ టికెట్స్ చూపించి బస్సు ప్రయాణం చేయవచ్చునని తెలిపారు. నాయకులు లింగేష్‌సాయి. గంగాధర్, దిలీప్, వెంకటేష్, రవి, ధనుష్ తదితరులు ఉన్నారు.

టీడీపీతోనే రాష్ట్రానికి భవిష్యత్తు: మాండ్ర

నందికొట్కూరు రూరల్, ఫిబ్రవరి 28: టీడీపీ అధికారంలోకి వస్తే రాష్ట్ర భవిష్యత్తు బాగుంటుందని టీడీపీ నంద్యాల లోక్‌సభ నియోజకవర్గ ఇన్‌చార్జి మాండ్ర శివానందరెడ్డి పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. అల్లూరు గ్రామంలోని మాండ్ర నివాసంలో బుధవారం టీడీపీ నియోజకవర్గ క్లస్టర్, యూనిట్, బూత్ ఇన్‌చార్జిలతో విస్తృత స్థాయి సమావేశం, శంఖారావంపై సమీక్ష నిర్వహించారు. మాండ్ర మాట్లాడుతూ ఎన్నికలు సమీపించాయని, అప్రమత్తంగా ఉండాలని సూచించారు. మినీ మేనిఫెస్టో గురించి ఇంటిం టింకి వెళ్లి వివరించాలన్నారు. శంఖారావం కిట్లను పంపిణీ చేశారు. రాక్షస పాలన నుంచి రాష్ట్రానికి విముక్తి కలిగించేందుకు ప్రతి ఒక్కరూ నడుం బిగించాలని పిలుపునిచ్చారు. నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

టీడీపీలో చేరిక

నటీడీపీ నంద్యాల లోక్‌సభ నియోజకవర్గ ఇన్‌చార్జి మాండ్ర శివానందరెడ్డి సమక్షంలో బుధవారం అల్లూరులోని ఆయన నివాసంలో మిడుతూరు మండల పీరుసాహెబ్ పేట వైసీపీ నాయకులు టీడీపీలో చేరారు. టీడీపీ మిడుతూరు మండల కన్వీనర్ కాతా రమేష్ రెడ్డి , సోమసుందరెడ్డి, ఆధ్వర్యంలో చేరారు. టీడీపీలో చేరిన వైసీపీ నాయకులకు మాండ్ర పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. జయరాముడు, ఎల్లనాగన్న, చిన్నభద్రారెడ్డి, వీరారెడ్డి, గోపాల్ రెడ్డి, రామంజనేయులు, తదితరులతో పాటు దాదాపుగా 50 కుటుంబాలు టీడీపీలో చేరాయి.


టీడీపీలో చేరిన పీరుసాహెబ్ పేట వైసీపీ నాయకులు

గుండం రమణారెడ్డి, వంగాల శివరామిరెడ్డి, జయసూర్య పాల్గొన్నారు.

● మిడుతూరు మండలంలోని రోళ్ళపాడు గ్రామంలో బాబు ష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. టీడీపీ నంద్యాల లోక్‌సభ నియోజకవర్గ ఇన్‌చార్జి మాండ్ర శివానందరెడ్డి ఇంటింటికి వెళ్లి మేనిఫెస్టో కరపత్రాలు పంపిణీ చేశారు. టీడీపీ మిడుతూరు మండల కన్వీనర్ కాతా రమేష్‌రెడి, గుండం రమణారెడ్డి ఆధ్వర్యంలో వైసీపీ నాయకులు వెంకటేశ్వరెడ్డి, ఖైరామ్‌రెడ్డి, శ్రీనివాసులు ఘౌడు, నాగస్వామిరెడ్డి, రామకృష్ణుడుతో పాటు 50 కుటుంబాలు టీడీపీలో చేరాయి. వారికి మాండ్ర పార్టీ కండావాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. వంగాల శివరామి రెడ్డి, శేషిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా జాతీయ విజ్ఞాన దినోత్సవం

నంద్యాల (నూనెపల్లె), ఫిబ్రవరి 28: మండలంలోని చాపిరేవుల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బుధవారం జాతీయ సైన్స్ దినోత్సవాన్ని నిర్వహించారు. సీవీ రామన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. జిల్లా సైన్స్ కోఆర్డినేటర్ సుబ్బారెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వ, చిత్రలేఖన పోటీలు నిర్వహించారు. సైన్స్ ప్రయోగాల నమూనాలను విద్యార్థులు ప్రదర్శించారు. ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు ప్రశంసాపత్రాలు, బహుమతులు అందజేశారు. హెచ్‌ఎం శ్రీనివాసులు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

నందికొట్కూరు రూరల్: నందికొట్కూరు మండలంలోని ప్రభుత్వ ప్రైవేట్ పాఠశాలలో జాతీయ సైన్స్ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. సర్ సీవీ రామన్ చిత్ర పటానికి పూల మాలలు వేసి ఘనంగా నివాళి అర్పించారు. హెచ్‌ఎం మొజావుద్దీన్ బాషా, అనితా జీవన్, వెంకటేశ్వర్లు, భ్రమరాంబ, పార్వతి, మోహన్‌రావు, విద్యార్థులు పాల్గొన్నారు.

పాములపాడు: వేంపెంట జడ్పీ ఉన్నత పాఠశాలలో జాతీయ సైన్స్ దినోత్సవాన్ని హెచ్‌ఎం కృష్ణమూర్తి ఆధ్వర్యంలో నిర్వహించారు. విద్యార్థులు ప్రదర్శించిన వైజ్ఞానిక ప్రదర్శనలు తిలకించారు. ఉపాధ్యాయులు చెన్నయ్య, నాగశేషులు, కోటయ్య, నాగరాజు, వెంకటేశ్వరరెడ్డి, నీలకంఠేశ్వరెడ్డి, చంద్రకళ


ప్రతిభ చూపిన విద్యార్థులతో జిల్లా సైన్స్ కోఆర్డినేటర్ సుబ్బారెడ్డి

విద్యార్థులు పాల్గొన్నారు.

పాణ్యం: శాంతిరాం ఫార్మసీ, ఇంజనీరింగ్ కళాశాలల్లో జాతీయ సైన్స్ దినోత్సవాన్ని నిర్వహించారు. సీవీ రామన్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. మంచి ప్రదర్శనలు రూపొందించిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. సైకాలజిస్ట్ విజయలక్ష్మి, ప్రిన్సి పాల్ డాక్టర్ మధుసూదన్ చెట్టి, శాంతిరాం ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సి పాల్ డాక్టర్ సుబ్రహ్మణ్యం, ప్రోగ్రాం కోఆర్డినేటర్ డాక్టర్ ఎలిజబేతమ్మ, అధ్యాపకులు హరిత, రమాదేవి, శ్రీలత, చాంద్‌బాషా, లోకేశ్, రమేష్ పాల్గొన్నారు.

డ్రంకెన్ డ్రైవ్ కేసులో ఇద్దరికి జైలు శిక్ష

నంద్యాల క్రైం, ఫిబ్రవరి 28: నంద్యాల పట్టణంలోని రాణి-మహారాణి థియేటర్, వై జంక్షన్ దగ్గర బుధవారం నిర్వహించిన డంకెన్ డ్రైవ్‌లో ఇద్దరు వ్యక్తులు మద్యం తాగి పట్టుబడినట్లు ట్రాఫిక్ సీఐ ఇస్మాయిల్ తెలిపారు. ఎస్.హుసేన్‌సా, ఎస్.జాకీర్‌పై కేసు నమోదు చేసి కోర్టులో హాజరు పరచగా సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ ఆర్.రాంభూపాల్‌రెడ్డి ఒక్కొక్కరికి ఏడు రోజుల జైలు శిక్ష విధిస్తూ ఉత్తర్వులు జారీ చేసినట్లు సీఐ తెలిపారు.

అలరించిన నిత్య కళారాధన


నృత్యం చేస్తున్న కళాకారులు

శ్రీశైలం, ఫిబ్రవరి 28: శ్రీశైల దేవస్థానం ధర్మపథంలో భాగంగా నిర్వహిస్తున్న నిత్యకళారాధన కార్యక్రమంలో బుధవారం రాజమహేంద్ర వరానికి చెందిన బాల రాజేశ్వరి కూచిపూడి నృత్యాలయం బృందంతో సంప్రదాయ నృత్యప్రదర్శన కార్యక్రమాన్ని ఏర్పాటు చేసింది. ఆలయ దక్షిణ మాడవీధిలోని నిత్య కళారాధన వేదిక వద్ద నిర్వహించిన కార్యక్రమంలో గణేశస్తుతి, శివాష్టకం, మహిషాసురమర్దిని, శైలసగిరివాసా, శివస్తుతి తదితర గీతాలకు మాన్య, రుద్రాణి, అన్వతేజ్, చిన్మయ్, గౌరి, వైష్ణవి, భవ్య, కావ్య, గాయత్రి, మనోజ్ఞ, దేవి హరణ్య, మనుశ్రీ, సత్య, స్వరూపిణి, హర్షవర్ధిని తదితరులు నృత్య ప్రదర్శనతో అలరించారు.

సంగమేశ్వరంలో కోట్ల


సంగమేశ్వరంలో కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి

కొత్తపల్లి, ఫిబ్రవరి 28: కొత్తపల్లి మండలంలోని కృష్ణానది తీరంలో ఉన్న ప్రాచీన సంగమేశ్వర ఆలయాన్ని కేంద్ర మాజీ మంత్రి, టీడీపీ జాతీయ ఉపాధ్యక్షుడు కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి బుధవారం దర్శించుకున్నారు. పురోహితులు తెలకపల్లి రఘురామశర్మ పూర్ణకుంభం స్వాగతం పలికారు. అనంతరం లలిత సంగమేశ్వరస్వామికి కోట్లతో పురోహితులు రుద్రాభిషేకం చేయించారు.

ప్రారంభమైన జ్యోతిర్ముడి సమర్పణ


దీక్ష విరమిస్తున్న శివస్వాములు

శ్రీశైలం, ఫిబ్రవరి 28: శ్రీశైలం మహాక్షేత్రంలో బుధవారం మహా శివరాత్రి జ్యోతిర్ముడి సమర్పణ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమాన్ని 15 రోజులపాటు 13 వతేదీ వరకు కొనసాగించనున్నారు. జనవరి 29 తేదీ శివమండల దీక్షను, 19 తేదీ అర్ధమండల దీక్షను స్వీకరించిన శివస్వాములు ఈ సమయంలో జ్యోతిర్ముడిని సమర్పిస్తారు.

ఉచిత విద్యకు దరఖాస్తుల స్వీకరణ

నంద్యాల రూరల్, ఫిబ్రవరి 28: విద్యా హక్కు చట్టం 2009 ప్రకారం 2024-25 విద్యా సంత్సరానికిగాను విద్యార్థుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు నంద్యాల మండల విద్యాధికారి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. సీబీఎస్ఈ/ఐబీ/ఐసీఎస్ఈ సిలబస్ పాఠశాలలో ప్రవేశానికి 2017 ఏప్రిల్ 2 నుంచి 2018 మార్చి 31 మధ్యలో జన్మించిన వారు అర్హులని తెలిపారు. స్టేట్ సిలబస్ పాఠశాలలో ప్రవేశం కోసం 2017 జూన్ 2 నుంచి 2018 మే 31 మధ్యలో జన్మించిన వారు అర్హులని చెప్పారు. దరఖాస్తులు మార్చి 14 తేదీ లోపు హెచ్‌టీటీపీ//సీఎస్‌ఈఏపీ.జీఓవీ.ఇన్ అనే ఆన్‌లైన్‌లో సమర్పించాలి. చిరునామా ధ్రువీకరణ కోసం తల్లిదండ్రుల ఆధార్/రేషన్‌కార్డు/భూమి హక్కుల పత్రం/ఎంజీఎన్ఆర్‌జీఈఎస్ జాబ్ కార్డ్/డ్రైవింగ్/విద్యుత్ బిల్లు/ అద్దె ఒప్పంద పత్రాలలో ఏదో ఒకటి సమర్పించాలి. పిల్లల వయసు ధృవీకరణ పత్రం సమర్పించాలి.

విద్యుత్ తీగల అపహరణ

గడివేముల, ఫిబ్రవరి 28: మండలంలోని బిలకలగూడురు గ్రామానికి చెందిన 12 మంది రైతుల పొలాల్లో గుర్తు తెలియని వ్యక్తులు విద్యుత్ తీగలు అపహరించారని రైతులు తెలిపారు. ఎస్ఆర్‌బీసీ కాలువపై ఉంచిన వ్యవసాయ మోటార్ల తీగలను గుర్తు తెలియని వ్యక్తులు అపహరించు కెళ్లారని రైతులు రామకృష్ణ, శ్రీనివాసులు, నాగేషులు, వెంకటస్వామి, రామకృష్ణ, హకీమ్ పోలీసులకు ఫిర్యాదు చేశారు.

ఫిర్యాదులను పరిష్కరిస్తాం: జేసీ


రాజకీయ పార్టీల ప్రతినిధులతో మాట్లాడుతున్న జేసీ

నంద్యాల (కల్చరల్), ఫిబ్రవరి 28: రాబోయే సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి వివిధ అంశాలపై రాజకీయ పార్టీలు ఇచ్చిన ఫిర్యాదులను ఎన్నికల కమిషన్ దృష్టికి తీసుకెళ్లామని, త్వరలోనే పరిష్కరిస్తామని జేసీ రాహుల్‌కుమార్ రెడ్డి అన్నారు. బుధవారం నంద్యాల జేసీ చాంబర్‌లో ఓట్ల లెక్కింపు కేంద్రాలు, స్ట్రాంగ్‌రూములు, రాజకీయ పార్టీల ఫిర్యాదులు తదితర అంశాలపై గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. కాంగ్రెస్ తరపున సయ్యద్ రియాజ్ బాషా, టీడీపీ తరుపున శివరామ్‌కుమార్, ప్రసాద్ రెడ్డి, బీజేపీ తరఫున చంద్రశేఖర్, వైసీపీ తరఫున అమృతరాజు, సాయిరాంరెడ్డి, సీపీఐ(ఎం) తరఫున పూల నరసిం హులు, బీఎస్పీ తరఫున శ్రీనివాసులు హాజరయ్యారు. జేసీ మాట్లాడుతూ రానున్న ఎన్నికల ఓట్ల లెక్కింపు కేంద్రాలకు ఎస్వీఆర్ ఇంజనీరింగ్ కాలేజీ, ఆర్జీఎం ఇంజనీరింగ్ కాలేజీలను ఆమోదం కోసం ఎన్నికల కమిషన్‌కు ప్రతిపాదనలు సమర్పించామని రాజకీయ పార్టీల ప్రతినిధులకు వివరించారు. ఎన్నికల కమిషన్ నిర్ణయించిన కాలేజీలోనే ఓట్ల లెక్కింపు ఉంటుందని చెప్పారు. ఓట్ల తొలగింపులకు సంబంధించి 4500 జాబితా ఎన్నికల సీఈవోకు పంపామని, ఇంకా 2300 జాబితా పంపాల్సి ఉందని వివరించారు. జిల్లాకు 86వేల ఓట్ల గుర్తింపు కార్డులు వచ్చాయని, మార్చి 7వ తేదీలోపు ఓటర్లకు పంపిణీ చేస్తామని చెప్పారు. నంద్యాల నియోజక వర్గానికి త్వరలో ఈఆర్‌వోను కూడా నియమించనున్నట్లు జేసీ తెలిపారు.

'కనీస సౌకర్యాలు కల్పించాలి'


రిజిస్టర్‌ను పరిశీలిస్తున్న డిప్యూటీ ఈవో మహబూబ్ బేగ్

గోస్పాడు, ఫిబ్రవరి 28: పదో తరగతి పరీక్షా కేంద్రాల్లో కనీస సౌకర్యాలు కల్పించాలని నంద్యాల డిప్యూటీ ఈవో మహబూబ్ బేగ్ ఆదేశించారు. మండలంలోని జడ్పీ ఉన్నత పాఠశాల, మోడల్ స్కూల్‌ను బుధవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. పది పరీక్ష నిర్వహణకు సంబంధించి ఏర్పాట్లను పరిశీలించారు. పాఠశాలలోని రిజిస్టర్లను, దస్త్రాలను తనిఖీ చేశారు. తరగతి గదిలోని విద్యార్థుల సామర్థ్యాలను ప్రశ్నల ద్వారా తెలుసుకున్నారు. మండలంలోని జూలేపల్లె గ్రామంలో ఉన్న ప్రాథమిక మెయిన్ పాఠశాలను తనిఖీ చేశారు. ఆయన వెంట ఎంఈవో అబ్దుల్ కరీం, తదితరులు ఉన్నారు.

'అవినీతికి మారుపేరు వైసీపీ'


ప్రజాపోరు యాత్రలో ప్రసంగిస్తున్న అభిరుచి మధు

నంద్యాల (కల్చరల్), ఫిబ్రవరి 28: అవినీతి, అరాచకాలు, కబ్జాలు, నేరాలు, ఘోరాలకు మారుపేరు వైసీపీ అని బీజేపీ నంద్యాల నియోజకవర్గ కన్వీనర్ అభిరుచి మధు అన్నారు. పొన్నాపురం, హౌసింగ్‌బోర్డు కాలనీ, ఎన్జీవో కాలనీ, విమార్ట్, ప్రభుత్వ ఆసుపత్రి ఏరియా, నూనెపల్లె ప్రాంతాల్లో బుధవారం ప్రజా పోరు యాత్ర నిర్వహించారు. పేదలందరికీ సెంటు స్థలం ఇస్తున్నామని గొప్పగా చెప్పుకుంటున్న వైసీపీ ప్రభుత్వం ఆ స్థలాలు ఎక్కడ ఇస్తున్నారో అందరికీ తెలుసునన్నారు. ఎకరా 4,5లక్షలకు కొనుగోలు చేసి 40,50 లక్షలకు కొనుగోలు చేసినట్లు పెట్టిన బిల్లులు, దొంగ బిల్లులుగా ఆధారాలతో నిరూపణ అయిందన్నారు. ఇప్పటి దాకా టిడ్కో గృహాలను పంపిణీ చేయకపోవడం దారుణమన్నారు. శిల్పా కుటుంబం ఆగడాలను అడ్డుకోవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నాగభూషణం, కిరణ్, శ్రీరాములు, శ్రీకాంత్, శంకరయ్య, కశెట్టి చంద్రశేఖర్, సుధాకర్ పాల్గొన్నారు.

రోడ్డు వేశారు.. క్యూరింగ్ మరిచారు


హాజీ నగర్‌లో క్యూరింగ్ చేయని సీసీ రోడ్డు

నందికొట్కూరు, ఫిబ్రవరి 28: పట్టణంలోని హాజీనగర్‌లో సీసీ రోడ్డు వేశారు గానీ క్యూరింగ్ చేయడం లేదు. హాజీ నగర్‌లోని అగ్గిపెట్టల ఫ్యాక్టరీ సమీప కాలనీలో నాలుగు రోజుల క్రితం దాదాపు వంద మీటర్ల మేర సీసీ రోడ్డును నిర్మించారు. అయితే క్యూరింగ్ చేయడం లేదని కాలనీవాసులు వాపోతున్నారు. క్యూరింగ్ లేకపోతే రోడ్డు ఎలా ఉంటుందని వారు ప్రశ్నిస్తున్నారు. క్యూరింగ్ చేసేలా అధికారులు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

'కార్మిక సంక్షేమ పథకాలు అమలు చేయాలి'


వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

నంద్యాల టౌన్, ఫిబ్రవరి 28: భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డును సమర్థవంతంగా నిర్వహించాలని, కార్మికులకు సంక్షేమ పథకాలు అమలు చేయాలని భవన నిర్మాణ కార్మికుల సంఘం జిల్లా అధ్యక్షుడు వి.బాలవెంకట్, కార్యదర్శి లక్ష్మణ్ డిమాండ్ చేశారు. బుధవారం నంద్యాల మున్సిపల్ కార్యాలయంలో ఉన్న కార్మిక శాఖ కార్యాలయం ఎదుట ధర్నా చేశారు. అనంతరం కార్మిక శాఖ అధికారులకు వినతిపత్రం అందజేశారు. నాయకులు మాట్లాడుతూ సంక్షేమ బోర్డు నిధులు రూ.2 వేల కోట్లను వెంటనే ప్రభుత్వం బోర్డుకు జమ చేయాలని డిమాండ్ చేశారు. కార్మికుల సమస్యల పరిష్కారంలో జగన్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని ఆరోపించారు. భవన నిర్మాణ కార్మికులకు పనులు కల్పించడంలో విఫలమయ్యారన్నారు. ఉపాధికి నష్టం కలిగించే మెమో 12, 14లను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సంఘం నాయకులు మహబూబ్‌బాషా, అంజి, వెంకటేశ్వర్లు, వరమయ్య, పలువురు భవన నిర్మాణ కార్మికులు, తాపీ మేస్త్రీలు పాల్గొన్నారు.

రిజిస్ట్రేషన్ పత్రాల పంపిణీ

జూపాడుబంగ్లా, ఫిబ్రవరి 28: మండలంలోని మండ్లెం గ్రామంలో బుధవారం జగనన్న ఇళ్ల పట్టాల రిజిస్ట్రేషన్ పత్రాలను డిప్యూటీ తహసీల్దార్లు చంద్రశేఖర్, నాగన్న లబ్ధిదారులకు అందజేశారు కార్యక్రమంలో సర్పంచ్ కృపమ్మ, వైస్ఎంపీపీ కృష్ణారెడ్డి, ఆర్ఐ రంగారెడ్డి, వీఆర్వో ఈశ్వరయ్య పాల్గొన్నారు.

కొత్తపల్లి: కొత్తపల్లి, శివపురం గ్రామాల్లో జగనన్న ఇళ్ల స్థలాల రిజిస్ట్రేషన్ పత్రాలను ఎంపీడీవో జవహర్‌బాబు, డిప్యూటీ తహసీల్దార్ పెద్దన్నలు లబ్ధిదారులకు పంపిణీ చేశారు. బుధవారం స్థానిక గ్రామ సచివాలయాల్లో ఆయా గ్రామాల సర్పంచుల ఆధ్వర్యంలో రిజిస్ట్రేషన్ల పత్రాలు పంపిణీ చేశారు. ఎంపీడీవో మాట్లాడుతూ కొత్తపల్లి గ్రామ పంచాయతీ పరిధిలో 108 మందికి రిజిస్ట్రేషన్ పత్రాలు అందజేయాల్సి ఉండగా.. ప్రస్తుతం 26 మందికి ఇచ్చినట్లు తెలిపారు. అలాగే డీటీ పెద్దన్న మాట్లడుతూ శివపురం గ్రామంలో 34 మందికి పత్రాలు పంపిణీ చేయాల్సి ఉండగా.. 31 మందికి పంపిణీ చేశామన్నారు. మిగతా వారికి కూడా త్వరలో అందజేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో శివపురం సర్పంచ్ చంద్రశేఖర్ యాదవ్, ఎంపీటీసీ శివన్న, మండల కోఆప్షన్ సభ్యులు మహ్మద్ గౌస్ వీఆర్వోలు లింగస్వామి, బాబుమియా, రామసుబ్బయ్య, సీనియర్ అసిస్టెంట్ సుందర్‌రావు, పంచాయతీ సెక్రటరీలు చిన్నస్వామి, అజ్మత్, టీడీపీ నాయకులు మోహన్ యాదవ్, తదితరులు ఉన్నారు.

'పోలియో చుక్కలు తప్పనిసరి'

వెలుగోడు, ఫిబ్రవరి 28: ఐదు సంవత్సరాల పిల్లలకు పోలియో చుక్కలు తప్పని సరిగా వేయించాలని వైద్యాధికారులు సూచించారు. మండలంలోని వేల్పనూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో బుధవారం పల్స్ పోలియో బూత్ కమిటీ సమావేశం నిర్వహించారు. వైద్యాధికారులు మాట్లాడుతూ ఈ పీహెచ్‌సీ పరిధిలో 1978 మంది చిన్నారులు ఉన్నారని, 8 పోలియో బూతులు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. వేల్పనూరులో 3, గుంతకందాలలో 1, మొబైల్ టీం 1, రేగడగూడూరులో 3 కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. మార్చి 3న బూత్‌లలో పోలియో చుక్కలు వేస్తామని, 5న ఇంటింటికి వెళ్లి పోలియో చుక్కలు వేస్తామని చెప్పారు. కార్యక్రమంలో వైద్యాధికారులు, సూపర్‌వైజర్స్, ఏఎన్ఎంలు, సిబ్బంది పాల్గొన్నారు.

'సైబర్ నేరాలతో అప్రమత్తంగా ఉండాలి'

కొత్తపల్లి, ఫిబ్రవరి 28: బ్యాంకు ఖాతాదారులు సైబర్ నేరాలతో అప్రమత్తంగా ఉండాలని కొత్తపల్లి ఎస్‌బీఐ మేనేజర్ పవన్ కుమార్ సూచించారు. బుధవారం మండలంలోని శివపురం, కొత్తపల్లి, వీరాపురం, గువ్వలకుంట్ల గ్రామాల్లో కొత్తపల్లి ఎస్‌బీఐ ఆధ్వర్యంలో ఆర్థిక అక్షరాస్యతపై ఎంవీ రూరల్ ఫోక్ ఆర్ట్స్ ఆర్గనైజేషన్ కళాజాత వారు బ్యాంకు పథకాలపై ప్రజలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ప్రధనంగా బ్యాంకులో లావాదేవీలపై సామాజిక భద్రత పతకాలు, ప్రధానమంత్రి సురక్ష బీమా యోజన, జీవనజ్యోతి బీమా యోజన, అటల్ పెన్షన్ యోజన, జీరో అకౌంటు రుణాలపై ప్రజలకు అర్థమయ్యేలా మాటలు, రాతలు మ్యాజిక్ షో ద్వారా వివరించారు. ఫీల్డ్ ఆఫీసర్ భగవాన్, బ్యాంకు సిబ్బంది, సీఎస్‌పీ రమాదేవి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా టైలర్స్ డే


కుట్టుమిషన్ పంపిణీ చేస్తున్న మాజీ మంత్రి ఫరూక్, టైలర్లు

నంద్యాల (కల్చరల్), ఫిబ్రవరి 28: నంద్యాల రాయలసీమ టైలర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బుధవారం టైలర్స్ డేను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మాజీ మంత్రి ఫరూక్ హాజరయ్యారు. అనంతరం పేద మహిళకు కుట్టుమిషన్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ అప్జల్ బాషా, అసోసియేషన్ అధ్యక్షుడు మక్బుల్ బాషా, గౌరవ అధ్యక్షుడు జమాల్ బాషా, ఉపాధ్యక్షుడు రాజగౌడ్ సెక్రటరీ సలాం తదితరలు పాల్గొన్నారు.

జూపాడుబంగ్లా: టైలర్ల సంక్షేమానికి ప్రభుత్వాలు కృషి చేయాలని నందికొట్కూరు టైలర్ల సంఘం అధ్యక్షుడు జయరాం కోరారు. జూపాడుబంగ్లాలోని సచివాలయంలో బుధవారం ప్రపంచ టైలర్ల దినోత్సవాన్ని సంఘం మండల అధ్యక్షుడు నజీర్, ఖాశీం అధ్యక్షతన నిర్వహించారు. ముందుగా కట్టుమిషన్ రూపకర్త, శాస్త్రవేత్త విలియమ్‌హో చిత్రపటానికి పూలమాల వేసి, ఇటీవల అకాలంగా మృతిచెందిన టైలర్‌బాషా, భగవాన్‌దాసుకు మౌనం పాటించి సంతాపం వ్యక్తం చేశారు. ఏఎస్ఐ మేరీజయంతి, అంబేడ్కర్ యువజన సంఘం అధ్యక్షుడు వైద్యులు ఎర్రన్న, టైలర్లు మాట్లాడారు. టైలర్లకు ప్రోత్సాహం అందించాలన్నారు. సీనియర్ టైలర్లను సత్కరించారు. పంచాయతీ కార్యదర్శి సామేలు, ఎంపీటీసీ కృపాకర్ తదితరులు పాల్గొన్నారు.

రక్తదానం చేసి ప్రాణదాతలు కండి



చాగలమర్రిలో రక్తదాన శిబిరం ప్రారంభిస్తున్న టీడీపీ మైనార్టీ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు అన్సర్‌బాషా

చాగలమర్రి, ఫిబ్రవరి 28: రక్తదానం చేసి ప్రాణదాతలు కావాలని టీడీపీ మైనార్టీసెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు అన్సర్‌బాషా అన్నారు. బుధవారం చాగలమర్రిలోని వాసవీ డిగ్రీ కళాశాలలో మనం బ్లడ్ డోనర్ సేవా సంస్థ నిర్వాహకుడు రఫీ ఆధ్వర్యంలో మెగా రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ శిబిరాన్ని మాజీ సర్పంచ్ అన్సర్‌బాషా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అత్యవసర సమయాల్లో రక్తం అందక చాలా మంది ఇబ్బందులు పడుతున్నారని, అటువంటి వారికి రక్తదానం ఎంతో ఉపయోగపడుతుందని అన్నారు. రక్తదానం చేసిన యువకులకు సర్టిఫికెట్లను అందజేశారు. కార్యక్రమంలో టీడీపీ బీసీసెల్ స్పోక్‌పర్సన్ సల్లానాగరాజు, టీఎన్‌టీయూసీ రాష్ట్ర కార్యదర్శి గుత్తి నరసింహులు, టీడీపీ నాయకులు కొలిమి ఉసేన్‌వలి, కొలిమి షరీఫ్, మౌలాలి, మాబు లాల్, అనిఫ్, ముల్లా శ్యాబుల్, జెట్టి నాగరాజు, గఫార్, అబ్దుల్లా, టైలర్ ఖాదర్, కేఆర్‌కే రవి, బషీర్, జెట్టి సుధాకర్, రాజేష్ పాల్గొన్నారు.

ఆర్యవైశ్యులు అన్ని రంగాల్లో రాణించాలి



ప్రమాణ స్వీకారం చేస్తున్న నూతన కార్యవర్గం సభ్యులు

బేతంచెర్ల, ఫిబ్రవరి 26: ఆర్యవైశ్యులు అన్ని రంగాలతో పాటు రాజకీయంగా రాణించాలని మహాసభ ఏపీ గౌరవాధ్యక్షుడు జయంతి వెంకటేశ్వర్లు సూచించారు. బుధవారం అమ్మవారిశాల పక్కన ఉన్న ప్రాంగణంలో నంద్యాల జిల్లా ఆర్యవైశ్య యువజన సంఘాల సమాఖ్య నూతన కార్యవర్గ సభ్యులు ప్రమాణస్వీకారం చేశారు. జిల్లా ఆర్యవైశ్య యువజన సంఘాల సమాఖ్య అధ్యక్షుడిగా బొగ్గరపు ధనుంజయ, ప్రధాన కార్యదర్శిగా భీమిశెట్టి రాజేంద్ర కుమార్, కోశాధికారిగా బచ్చు లక్ష్మీనారాయణ, కార్యనిర్వహణ అధ్యక్షుడిగా కలిగి వెంకట సతీష్ కుమార్, ఏపీ ఆర్యవైశ్య యువజన సంఘం ఆర్గనైజర్ కొప్పురావూరి హరికృష్ణ, నూతన కార్యవర్గ సభ్యులచే ప్రమాణ స్వీకారం చేయించారు. కార్యక్రమంలో గుండా నాగ సుప్రజా, శ్యాంసుందర్‌గుప్తా, గుండా గోపాల్, మండల ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు కందగడ్డల జనార్దన్, గుండా ఉమాదేవి, గుండా జగన్మోహన్‌రావు, గుండా జయచంద్ర కుమార్, శేషమోహన్ బల్లాని సాయి, విష్ణుమోహన్ పాల్గొన్నారు

ఆర్యవైశ్య యువజన సంఘం ఎన్నిక

చాగలమర్రి, ఫిబ్రవరి 28: నంద్యాల జిల్లా చాగలమర్రి వాసవీ యువజన సంఘం కార్యదర్శిగా హరికృష్ణ, సహాయ కార్యదర్శిగా వల్లం కొండు సాయి, ఈసీ సభ్యులుగా బచ్చు సుగుణాకర్, వాసు దేవయ్య, నరేంద్రకుమార్‌లను బుధవారం బేతంచర్ల వాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. వీరిని ఆర్యవైశ్య యువజన సంఘం జిల్లా అధ్యక్షుడు ధనుంజయ ప్రమాణ స్వీకారం చేయించి సన్మానించారు. కార్యక్రమంలో యువజన సంఘ అధ్యక్షుడు ఉదయ్‌కుమార్, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

యువత ఓట్లు కీలకం



గంగవరంలో యువకులకు అవగాహన కల్పిస్తున్న సభ్యులు

శిరివెళ్ల, ఫిబ్రవరి 28 : రానున్న ఎన్నికల్లో యువత ఓట్లు అత్యంత కీలకమని ఏపీ వారియర్స్ టీం సభ్యులు కమతం రాజశేఖర్ రెడ్డి, ఉల్లి వెంకట సుబ్బయ్య అన్నారు. 'ఫస్ట్ ఓట్ ఫర్ సీబీఎన్' కార్యక్రమంలో భాగంగా మండలంలోని గంగవరం, గుంప్రమాన్‌దిన్నె, వనికెందిన్నె, జీనేపల్లె, రాజనగరం గ్రామాల్లో బుధవారం పర్యటించి బూత్ ఇన్‌చార్జులు, యువతకు అవగాహన కల్పించారు. అన్ని వర్గాల ప్రజలకు సంక్షేమ పథకాలు పుష్కలంగా అందాలంటే విజన్ ఉన్న నాయకుడు నారా చంద్రబాబు సీఎం కావాలన్నారు.

ఓటు వినియోగించుకోండి

ఉయ్యాలవాడ, ఫిబ్రవరి 28: ప్రశాంత వాతావరణంలో ఓటును వినియోగించుకోవాలని ఆళ్లగడ్డ డీఎస్పీ షర్ఫుద్దీన్ ప్రజలకు సూచించారు. బుధవారం మండలంలోని ఉయ్యాలవాడ, ఇంజేడు, తుడుములదిన్నె గ్రామాల్లో ఆయన పర్యటించి ప్రజలతో మాట్లాడారు. ఆయన మాట్లాడుతూ సమస్యాత్మక గ్రామాల్లో అల్లర్లు సృష్టిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రతి ఒక్కరూ మంచి వాతావరణంలో నిర్భయంగా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎస్‌ఐ రామాంజనేయరెడ్డి, హెడ్‌కానిస్టేబుల్ షరీఫ్ తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ సభను విజయవంతం చేద్దాం

డోన్, ఫిబ్రవరి 28: డోన్ అసెంబ్లీ టీడీపీ అభ్యర్థి శుక్రవారం పట్టణానికి వస్తున్న సందర్భంగా టీడీపీ ఆధ్వర్యంలో జరిగే బహిరంగ సభను విజయవంతం చేద్దామని టీడీపీ రాష్ట్ర కార్యదర్శులు వై. నాగేశ్వరరావు యాదవ్, వలసల రామకృష్ణ పిలుపునిచ్చారు. బుధవారం పట్టణంలోని టీడీపీ నాయకులు లక్ష్మీనారాయణ యాదవ్ నివాసంలో వారు మాట్లాడుతూ టీడీపీ అధినేత చంద్రబాబు నమ్మకాన్ని నిలబెట్టుకునేలా డోన్ నియోజకవర్గంలో టీడీపీ గెలుపునకు అందరం కలిసికట్టుగా కృషి చేద్దామన్నారు. డోన్ అసెంబ్లీ టీడీపీ అభ్యర్థిగా తన పేరును ప్రకటించిన తర్వాత మొదటి సారి వస్తున్న కోట్ల సూర్యప్రకాష్ రెడ్డికి భారీ స్వాగతం పలికి సత్తా చాటుదామన్నారు. వైసీపీ పాలనపై అన్ని వర్గాల ప్రజలు విసిగిపోయారని, చంద్రబాబును ముఖ్యమంత్రిగా చేసుకోవాలని ప్రజలు సంసిద్ధులుగా ఉన్నారన్నారు. డోన్ నియోజవర్గాన్ని ఎంతో అభివృద్ధి చేసిన కోట్ల కుటుంబానికి అందరం అండగా నిలిచి కోట్లను గెలిపించుకుందామన్నారు. సమావేశంలో మండల పార్టీ అధ్యక్షుడు శ్రీనివాసులు యాదవ్, టీడీపీ నాయకులు ఆలేబాదు పరమేష్, తాండ్రపల్లి ఆచారి, రంగనాథం, గురుస్వామి యాదవ్, న్యాయవాది లక్ష్మన్న పాల్గొన్నారు.

డోన్‌లో టీడీపీ జెండా ఎగుర వేద్దాం



ప్యాపిలిలో మాట్లాడుతున్న వై.నాగేశ్వరరావుయాదవ్

ప్యాపిలి: వచ్చే ఎన్నికల్లో కలసి కట్టుగా పని చేసి డోన్‌లో టీడీపీ జెండా ఎగుర వేద్దామని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి వై నాగేశ్వరరావుయాదవ్ పిలుపు నిచ్చారు. బుధవారం పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో కార్యకర్తల సమావేశంలో ఆయన పాల్గొన్నారు. నాగేశ్వరరావుయాదవ్ మాట్లాడుతూ టీడీపీ డోన్ అభ్యర్థిగా పోటీ చేస్తున్న కోట్ల సూర్యప్రకాష్‌రెడ్డిని గెలిపించుకుందామన్నారు. ఇందుకోసం ప్రతి కార్యకర్త శక్తి వంచన లేకుండా కృషి చేయాలని పిలుపు నిచ్చారు. 1న డోన్‌లో టీడీపీ ఆధ్వర్యంలో భారీ బహిరంగ సభను నిర్వహిస్తున్నామని, సభకు పార్టీ శ్రేణులు, కోట్ల, కేఈ అభిమానులు తరలి రావాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు టి శ్రీనివాసులు, ఆలేబాదు పరమేష్, రామ్మోహన్‌యాదవ్, గండికోట రామసుబ్బయ్య, వెంకటరమణాచారి, నాగేంద్ర, కలచట్ల ప్రసాద్, కోదండరాము, గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

టైలర్ల అభివృద్ధికి కృషి చేస్తా : మాజీ ఎమ్మెల్యే బీసీ



కేక్ కట్ చేస్తున్న మాజీ ఎమ్మెల్యే బీసీ జనార్దన్‌రెడ్డి

కోవెలకుంట్ల, ఫిబ్రవరి 28 : టీడీపీ అధికారంలోకి వస్తే టైలర్లకు సహకారం అందించి, ఉపాధి కల్పిస్తామని మాజీ ఎమ్మెల్యే బీసీ జనార్దన్‌రెడ్డి పేర్కొన్నారు. బుధవారం కోవెలకుంట్లలోని పేరా రామసుబ్బారెడ్డి ఫంక్షన్ హాల్‌లో టైలర్స్ డే కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మాజీ ఎమ్మెల్యే బీసీ హాజరై, కేక్ కట్ చేసి టైలర్లకు టైలర్స్‌డే శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం బీసీ జనార్దన్‌రెడ్డి మాట్లాడుతూ ప్రస్తుతం రెడీమేడ్ దుస్తులు అధికం కావడంతో టైలర్లకు ఆర్థిక ఇబ్బందులు అధికమయ్యాయన్నారు. టైలర్లు ఐక్యంగా ఉండి ఒక సొసైటీ ఏర్పరచుకుంటే టీడీపీ గెలిచాక ప్రభుత్వం నుంచి బ్యాంకుల నుంచి రుణాలు ఇప్పించి వారిని ఆర్థికంగా అభివృద్ధి చెందించేలా కృషి చేస్తామన్నారు. గతంలో టైలర్లందరికీ ఇంటి స్థలాలు అందిస్తామని చెప్పామని, అనివార్య కారణాల వల్ల ఇంటిస్థలాలు ఇవ్వలేకపోయామన్నారు. పేద టైలర్లకు 60మందికి కుట్టుమిషన్ల అందించామన్నారు. భవిష్యత్‌లో టైలర్లు కలసిమెలసి ఆర్థికంగా బలోపేతం కావాలన్నారు. ప్రజలు ఆశీర్వదించి టీడీపీ ప్రభుత్వాన్ని గెలిపిస్తే టైలర్ల సమస్యను చంద్రబాబు దృష్టికి తీసుకువచ్చి వారి అభ్యున్నతికి పాటుబడతామన్నారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి గడ్డం రామకృష్ణారెడ్డి, కోవెలకుంట్ల మాజీ సింగిల్‌విండో చైర్మన్ గువ్వలసుబ్బారెడ్డి, మాజీ మార్కెట్‌యార్డు చైర్మన్ గడ్డం నాగేశ్వరరెడ్డి, మండల టీడీపీ అధ్యక్షుడు అమడాల మద్దిలేటి, డాక్టర్ పేరా శ్రీధర్‌రెడ్డి, బీవీప్రసాద్‌రెడ్డి, గాథశెట్టి రమణయ్య, కాట్రెడ్డి మల్లికార్జునరెడ్డి, పెనుగొండ రాజశేఖర్, గడ్డం అమర్‌నాథరెడ్డి, కుళాయి, టైలర్స్‌సంఘం సభ్యులు సుబ్బారెడ్డి, బాషా, తిరుపాలు, చక్రి, జాఫర్‌హుసేని, భీమన్న తదితరులు పాల్గొన్నారు.

ప్యాపిలి: పట్టణంలో బుధవారం వయోవృద్ధుల సంఘం ఆధ్వర్యంలో అంతర్జాతీయ దర్జీ కళా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. గాంధీ విగ్రహనికి పూల మాలలు వేసి నివాళి అర్పించారు. సంఘం నాయకులు ఎం బాబాసాహెబ్, శ్యాంసన్ మాట్లాడుతూ పూర్వం దర్జీల కళా నైపుణ్యానికి ఎంతో గుర్తింపు ఉండేదన్నారు. ప్రభుత్వం దర్జీల కళాను గుర్తించి ప్రోత్సాహం కల్పించాలని వారు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పట్టణంలోని దర్జీలు పాల్గొన్నారు.

వైసీపీకి పతనం తప్పదు

చాగలమర్రి, ఫిబ్రవరి 28: రాష్ట్రంలో వైసీపీకి పతనం తప్పదని మాజీ మంత్రి భూమా అఖిలప్రియ అన్నారు. బుధవారం మండలంలోని పెద్దవంగలి గ్రామానికి చెందిన ఉప సర్పంచ్ బాల నరసింహుడు, వార్డు సభ్యులు ఉసేన్‌బీ, వెంకటసుబ్బయ్య, నాగరాజు, దస్తగిరి, శ్రీనివాసులు, పవన్‌తో పాటు మరో 50 కుటుంబాలు వైసీపీ నుంచి టీడీపీలో చేరారు. వారికి పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. ఆమె మాట్లాడుతూ తమ నాయకత్వాన్ని, టీడీపీ పార్టీని నమ్మి చేరిన వారికి భూమా కుటుంబం ఎళ్లవేలలా అండగా ఉంటుందని అన్నారు. వైసీపీ ఐదేళ్ల పాలనలో అవినీతి, అక్రమాలు, దౌర్జన్యాలు తప్పా అభివృద్ధి శూన్యమని అన్నారు. టీడీపీ అధికారంలోకి రాగానే తాగునీటి సమస్య లేకుండా చూస్తామని అన్నారు. అనంతరం చిన్నవంగలి గ్రామంలో టీడీపీ నాయకుడు రాజశేఖర్‌రెడ్డి అనారోగ్యానికి గురి కావడంతో ఆయన నివాసానికి వెళ్లి అఖిలప్రియ పరామర్శించారు. ధైర్యంగా ఉండాలంటూ భరోసా కల్పించారు. కార్యక్రమంలో టీడీపీ మండల కన్వీనర్ నరసింహారెడ్డి, మైనార్టీసెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు అన్సర్‌బాషా, బీసీసెల్ స్పోక్‌పర్సన్ సల్లానాగరాజు, టీడీపీ నాయకులు కొలిమి ఉసేన్‌వలి, కొలిమి షరీఫ్, గ్రామ టీడీపీ నాయకులు పాల షరీఫ్, నాగేంద్రకుమార్, ఓబయ్య, టీఎన్ఎల్ పుల్లయ్య, నర్సయ్య, నాగేశ్వరరావు, సంజీవరెడ్డి, నరేంద్రారెడ్డి, రాజు తదితరులు పాల్గొన్నారు.



పెద్దవంగలిలో టీడీపీలో చేరిన వైసీపీ నాయకులు

ఎమ్మెల్యే ఇల్లు ముట్టడి

నంద్యాల, ఆంధ్రజ్యోతి ఫిబ్రవరి 28: ఆళ్లగడ్డ మున్సిపాలిటీలో, గ్రామాల్లో ఏర్పడిన మంచి నీటి ఎద్దడిని పరిష్కరించాలని ఎమ్మెల్యే బిజేంద్రారెడ్డి ఇంటిని గురువారం ప్రజలతో ముట్టడిస్తున్నట్లు మాజీ మంత్రి అఖిలప్రియ అన్నారు. పట్టణంలోని ఆచారి కాలనీలో బుధవారం బాబు షూరిటీ - భవిష్యత్తు గ్యారెంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ చాంద్‌బాషా, కౌన్సిలర్ హుసేన్‌బాషా, మాజీ కౌన్సిలర్లు సలాం, నరసింహులు, శేఖర్‌రెడ్డి, రామాచారి పాల్గొన్నారు.

గుండంపాడులో వెంకటేశ్వర స్వామి కల్యాణం

శిరివెళ్ల, ఫిబ్రవరి 28 : మండలంలోని గుండంపాడు గ్రామంలోని లక్ష్మీ వెంకటేశ్వర స్వామి ఆలయ 9వ వార్షికోత్సవం సందర్భంగా మార్చి 12న శ్రీదేవీ భూదేవి సమేత వెంకటేశ్వర స్వామి ఉత్సవమూర్తులకు కల్యాణం నిర్వహించనున్నట్లు నిర్వాహకులు బుధవారం తెలిపారు. ఆలయంలోని మూలవిరాట్‌కు వేకువజామునుంచే ప్రత్యేక పూజలు, కల్యాణం, సాయంత్రం గ్రామోత్సవం నిర్వహిస్తామన్నారు.

అవధూత సుబ్బమ్మ అవ్వ మృతి



ఉయ్యాలవాడ, ఫిబ్రవరి 28 : మండలంలోని కుందూనది ఉన్న వేణుగోపాల స్వామి ఆశ్రమ నిర్వాహకురాలు, ఆధ్యాత్మిక వేత్త అవధూత దాసరి సుబ్బమ్మ (80) బుధవారం కన్నుమూశారు. గత 40 ఏళ్లగా ఆశ్రమంలో ఉంటూ సుబ్బమ్మ అవ్వ నిరక్షరాస్యురాలైనప్పటికీ సుబ్బారెడ్డి స్వామి వద్ద శిష్యరికం చేసి, ఆయన మరణానంతరం ఆశ్రమ భక్తులకు భగవద్గీత, రామాయణం నేర్పించేవారు. ఈమె మృతికి ఆశ్రమ నిర్వాహకులు, గ్రామ పెద్దలు, శిష్యులు ప్రగాఢ సంతాపం తెలిపారు. గురువారం అంత్యక్రియలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు.

ఆకట్టుకున్న రష్యన్ల నృత్యం



నృత్యం చేస్తున్న రష్యా భక్త బృందం

రుద్రవరం, ఫిబ్రవరి 28 : మండలంలోని హరినగరం ఇస్కాన్ టెంపుల్ ఆధ్వర్యంలో బుధవారం రాత్రి సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. పార్వేట ఉత్సవ పల్లకీ చివరి మజిలీలో ఘనంగా వీడ్కోలు పలికారు. ఇస్కాన్ టెంపుల్‌లో వృషభవాహనుడికి ప్రత్యేక పూజలు చేశారు. రష్యా దేశస్తులు 50 మంది భక్తబృందం భక్తిగీతాలకు నృత్యాలు చేశారు. ఈ నృత్య ప్రదర్శన భక్తులను, స్థానికులను ఎంతగానో ఆకట్టుకుంది. చుట్టుపక్కల గ్రామాల నుంచి భారీగా భక్తులు తరలివచ్చారు. కార్యక్రమాల్లో ప్రాజెక్టు మేనేజరు చంద్రకేశవదాస్ పాల్గొన్నారు.

రాష్ట్రాన్ని నాశనం చేశారు: కోట్ల



కోట్ల సూర్యప్రకాష్‌రెడ్డిని గజమాలతో సన్మానిస్తున్న నాయకులు

డోన్, ఫిబ్రవరి 28: వైసీపీ ప్రభుత్వం తన అరాచక పాలనతో రాష్ట్రాన్ని నాశనం చేసిందని కేంద్ర మాజీ మంత్రి, డోన్ అసెంబ్లీ టీడీపీ అభ్యర్థి కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి అన్నారు. బుధవారం రాత్రి కర్నూలులోని కోట్ల నివాసంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శులు వై.నాగేశ్వరరావు యాదవ్, వలసల రామకృష్ణ, పట్టణ టీడీపీ కార్యదర్శి ఎస్ఎండీ రఫీ కోట్లను కలిసి శుభాకాంక్షలు తెలిపారు. కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి మాట్లాడుతూ సీఎం జగన్ ఒక్క చాన్స్ పేరుతో అధికారంలోకి వచ్చి రాష్ట్ర ప్రజలకు భవిష్యత్తు లేకుండా చేశారన్నారు. వైసీపీ అవినీతి అక్రమాలను ప్రశ్నించే వారిపై అక్రమ కేసులు బనాయించి వైసీపీ ఇబ్బందులకు గురి చేస్తోందని ధ్వజమెత్తారు. ఓటమి భయంతోనే నంద్యాల జిల్లా టీడీపీ అధ్యక్షుడు మల్లెల రాజశేఖర్‌పై అక్రమ కేసులు బనాయించారని మండిపడ్డారు. వైసీపీ నాయకులకు రాబోయే ఎన్నికల్లో ప్రజలు బుద్ధి చెప్పి చంద్రబాబును ముఖ్యమంత్రిగా చేసుకోవడం ఖాయమన్నారు. డోన్ నియోజకవర్గంలో టీడీపీ కార్యకర్తలకు అన్ని రకాలుగా అండగా ఉంటానన్నారు.

కోట్లను గెలిపించండి



మాట్లాడుతున్న కోట్ల రాఘవేంద్ర రెడ్డి

బేతంచెర్ల, ఫిబ్రవరి 28: డోన్ టీడీపీ అభ్యర్థిగా కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి గెలిపించాలని కోట్ల రాఘవేంద్ర రెడ్డి కోరారు. బుధవారం కొలుములపల్లె రస్తాలో వెలసిన చౌడేశ్వరీ దేవాలయం నుంచి ఆంజనేయస్వామి ఆలయం వరకు ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో పోలూరు వెంకటేశ్వరరెడ్డి, ఎల్ల నాగయ్య, బుగ్గన ప్రసన్న లక్ష్మి, పోలూరు రాఘవరెడ్డి, సుధాకర్, జాకీరుల్లా బేగ్, మేకల నాగరాజు, రూబెన్, రామాంజనేయులు, గూ టుపల్లె ముల్లా, హెచ్.కొట్టాల మహేష్, యోగేంద్రబాబు, నందీశ్వరుడు పాల్గొన్నారు.

రేపటి నుంచి వంద పడకల ఆసుపత్రిలో జనరల్ ఓపీ

డోన్(రూరల్), ఫిబ్రవరి 28: 1 నుంచి గుత్తి రోడ్డులో నూతనంగా నిర్మించిన వంద పడకల ఆసుపత్రిలో జనరల్ ఓపీని ప్రారంభిస్తున్నట్లు డోన్ ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండెంట్ మహ్మద్ హనీఫ్ తెలిపారు. బుధవారం పాతపేటలోని ప్రభుత్వాసుపత్రిలో సూపరింటెండెంట్ మాట్లాడుతూ సాధారణ జ్వరాలు, దగ్గు, జలుబు వంటి వ్యాధులకు వంద పడకల ఆసుపత్రిలో సేవలందించడం జరుగుతుందన్నారు. పాతపేటలోని పాత ఏరియా ఆసుపత్రులు కొద్ది రోజుల వరకు సిజేరియన్, తదితర వాటికి సేవలు అందించడం జరుగుతుందని, ప్రజలు గమనించి సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో డాక్టర్లు శశికుమార్, భవాని, ముజామిల్, సుకుమార్ పాల్గొన్నారు.

'హామీలను విస్మరించిన వైసీపీ ప్రభుత్వం'



మాట్లాడుతున్న ఆలా మోహన్ రెడ్డి

డోన్(రూరల్), ఫిబ్రవరి 28: ఎన్నికల సమయంలో రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ప్రజలకు ఇచ్చిన హామీలను విస్మరించారని జనసేన నియోజకవర్గ నాయకుడు ఆలా మోహన్ రెడ్డి ఆరోపించారు. బుధవారం రాత్రి జనసేన పార్టీ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో సంపూర్ణ మద్యపాన నిషేధం తీసుకువస్తామని ప్రజలకు హామీ ఇచ్చి వంచించారని ధ్వజమెత్తారు. వచ్చే నెల ఒకటో తేదీన డోన్‌కు వస్తున్న టీడీపీ అసెంబ్లీ అభ్యర్థి కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి చేతుల మీదుగా జనసేన పార్టీ కార్యాలయాన్ని అధికారికంగా ప్రారంభిస్తున్నట్లు ఆయన తెలిపారు. సమావేశంలో జనసేన నాయకులు పరదేశి మహేష్, రమేష్, రాయల్ శ్రీను పాల్గొన్నారు.

విధులను సక్రమంగా నిర్వహించాలి



మాట్లాడుతున్న కామేశ్వరరావు

బనగానపల్లె, ఫిబ్రవరి 28 : త్వరలో జరిగే ఎన్నికలు సజావుగా నిర్వహించడానికి ఎన్నికల సిబ్బంది నిక్కచ్చిగా వ్యవహరించాలని బనగానపల్లె నియోజకవర్గం ఎన్నికల అధికారి కామేశ్వరరావు సూచించారు. బుధవారం ఎంపీడీవో కార్యాలయంలో బనగానపల్లె నియోజకవర్గం ఫ్లయింగ్‌స్క్వాడ్, ఇతర సిబ్బందికి శిక్షణా కార్యక్రమాలు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ త్వరలో ఎన్నికల కోడ్ రానుందని అందుకు తగ్గట్టు సిబ్బందికి శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చిన వెంటనే నాయకుల బొమ్మలు కనిపించకుండా స్టిక్కర్లు, గడ్డులతో కప్పివేయాలన్నారు. ఎన్నికల్లో డబ్బుల పంపిణీని అరికట్టాలన్నారు. ఎమ్మెల్యే అయితే రూ.40లక్షలు, ఎంపీ అయితే రూ.95 లక్షలు ఖర్చు పెట్టాలన్నారు. అలాగే వ్యక్తులు రూన.50వేల కంటే అధికంగా తమ వద్ద ఉంచుకోరాదన్నారు. అంతకు ఎక్కువగా ఉంటే ఎన్నికల టీం పట్టుకుంటుందన్నారు. ఒక వ్యక్తి రూ10 లక్షలకంటే ఎక్కువ తీసుకుపోతుంటే దానికి సంబంధించిన వివరాలు సంబంధిత వ్యక్తి తెలియజేయాలని, లేకుండా ఇన్‌కంట్యాక్సు అధికారులకు అప్పగించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గంలోని బనగానపల్లె, అవుకు, కొలిమిగుండ్ల, సంజామల, కోవెలకుంట్ల మండలాల సిబ్బంది, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

రాజకీయ కక్షతోనే మల్లెల రాజశేఖర్‌పై రౌడీషీట్

డోన్, ఫిబ్రవరి 28: వైసీపీ నాయకులు రాజకీయ కక్షతోనే నంద్యాల టీడీపీ అధ్యక్షుడు మల్లెల రాజశేకర్‌పై రౌడీషీట్ ఓపెన్ చేశారని టీడీపీ జిల్లా అధికార ప్రతినిధి విజయభట్టు అన్నారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి వైసీపీ అరాచక పాలన గురించి ప్రశ్నించే టీడీపీ నాయకులుపై అక్రమ కేసులు నమోదు చేయడం, దాడులకు పాల్పడడం అన్యాయమన్నారు. వైసీపీకి వచ్చే ఎన్నికల్లో ఓటుతో బుద్ధి చెప్పాలని ప్రజలకు పిలుపునిచ్చారు.

రోడ్డు ప్రమాదంలో ప్రకాశం జిల్లా యువకులకు గాయాలు

రుద్రవరం, ఫిబ్రవరి 28 : మండలంలోని యల్లావత్తుల గ్రామ సమీపంలో బుధవారం మోటరు సైకిలు అదుపు తప్పి ప్రకాశం జిల్లా గిద్దలూరులోని నల్లబండ బజారుకు చెందిన మౌలాలి, దుర్గా ప్రసాద్ అనే ఇద్దరు యువకులు తీవ్రంగా గాయపడ్డారు. రుద్రవరంలో జరుగుతున్న పార్వేట పల్లకీ ఉత్సవాన్ని తిలకించి స్వగ్రామానికి వెళుతుండగా ఈ ఇద్దరు ప్రమాదానికి గురయ్యారు. 108 వాహనంలో నంద్యాల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

సాంకేతిక విజ్ఞానాన్ని అలవర్చుకోవాలి



యర్రగుంట్ల డిగ్రీ కళాశాలలో నివాళి అర్పిస్తున్న అధ్యాపకులు



చాగలమర్రి కస్తూర్బా పాఠశాలలో విద్యార్థినులకు ప్రశంసా పత్రాలు అందజేస్తున్న ఎంఈవోలు, ఎస్‌వో



బనగానపల్లె బాలికల ఉన్నత పాఠశాలలో విద్యార్థులు ప్రదర్శించిన ప్రాజెక్టులను తిలకిస్తున్న ఉపాధ్యాయులు

శిరివెళ్ల, ఫిబ్రవరి 28 : విద్యార్థులు శాస్త్ర సాంకేతిక విజ్ఞానాన్ని అలవరచుకోవాలని యర్రగుంట్ల గంగుల తిమ్మారెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ రామకృష్ణారెడ్డి అన్నారు. జాతీయ సైన్స్ దినోత్సవం సందర్భంగా డిగ్రీ కళాశాలలో సర్ సీవీ రామన్ చిత్రపటానికి పూలమాల వేసి బుధవారం నివాళి అర్పించారు. శిరివెళ్ల జడ్పీ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు.

చాగలమర్రి: చాగలమర్రిలోని కస్తూర్బాగాంధీ పాఠశాలలో బుధవారం జాతీయ సైన్స్ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. జిల్లా దీక్ష కో-ఆర్డినేటర్ నాగేంద్రకుమార్, పాఠశాల ప్రిన్సిపాల్ సునిత ఆధ్వర్యంలో ఎంఈవోలు అనూరాధ, న్యామతుల్ల సైన్స్ దినోత్సవ వేడుకలను ప్రారంభించారు. విద్యార్థులు ఏర్పాటు చేసిన సైన్స్ నమూనాలను పరిశీలించారు. ఎంఈవో అనూరాధ మాట్లాడుతూ విద్యార్థులు సైన్స్ విజ్ఞానాన్ని పెంపొందించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో కాంప్లెక్స్ హెచ్ఎం జీవయ్య, ఉపాధ్యాయులు మైకెల్, విజయరాజు, ఉసేన్‌బీ, నాగలక్ష్మి పాల్గొన్నారు.

బనగానపల్లె : మండలంలో జాతీయ సైన్సు దినోత్సవ వేడుకలు బుధవారం ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని బాలికల ఉన్నతపాఠశాలలో హెచ్ఎం గంగాధర్‌రెడ్డి ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించారు. పాఠశాలలో బాలికలు 150 వైజ్ఞానిక ప్రదర్శనలు నిర్వహించారు. ఉత్తమ ప్రదర్శనలు కనబరచిన బాలికలకు బహుమతులు అందించారు. యాగంటిపల్లె ఉన్నతపాఠశాలలో జాతీయ సైన్సు వేడుకలు హెచ్ఎం పద్మావతి ఆధ్వర్యంలో నిర్వహించారు. విద్యార్థుల్లో సైన్సు సబ్జెక్టుపట్ల ఆసక్తి పెంచుకొని భవిష్యత్‌లో శాస్త్రసాంకేతిక రంగంలో ప్రయోగాలు చేయాలని కోరారు. సైన్సు ఉపాధ్యాయుడు రాంపుల్లారెడ్డి పాల్గొన్నారు. టంగుటూరు జడ్పీ ఉన్నతపాఠశాలలో హెచ్ఎంపర్వీన్ బాను ఆధ్వర్యంలో సైన్సు దినోత్సవం వేడుకలు నిర్వహించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు రాజశేఖర్, సుబ్బారెడ్డి, మహమ్మద్‌రఫీ, హరినాథ్‌గౌడ్, హమీదాబేగం, రిజ్వానా, చంద్రశేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. ప్రభుత్వ డిగ్రీకళాశాలలో భౌతికశాస్త్ర విభాగం ఆధ్వర్యంలో ఘనంగా జాతీయసైన్సు వేడుకలను ప్రిన్సిపాల్ స్వర్ణలతాదేవి ఆధ్వర్యంలో నిర్వహించారు. కార్యక్రమంలో భౌతికశాస్త్ర అధ్యాపకుడు ఉమామహేశ్వర్‌రెడ్డి, అధ్యాపకుడు బాబూనాథ్, డాక్టర్ సూర్యనారాయణరెడ్డి, కోటేశ్వరరావు, సయ్యద్ గౌస్, కౌసల్యాదేవి, నాగరాజారెడ్డి, రామన్న, వహిదా పాల్గొన్నారు.

డోన్(రూరల్): పట్టణంలోని పాతపేట జిల్లా పరిషత్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో సైన్స్ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు వెంకటసుబ్బారెడ్డి, ఉపాధ్యాయ బృందం పాల్గొంది. అలాగే పట్టణంలోని శ్రీచైతన్య పాఠశాలలో సైన్స్ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఎంఈవో ప్రభాకర్, పట్టణ సీఐ ప్రవీణ్ కుమార్, ఎస్ఐ శరత్ కుమార్ రెడ్డి, ఆర్డీవో క్రాంతి కుమార్, డాక్టర్ సుంకన్న, శ్రీచైతన్య స్కూల్ ప్రిన్సిపాల్ ఉమా పాల్గొన్నారు.



బేతంచెర్లలో...

కొలిమిగుండ్ల: కొలిమిగుండ్లలో ఉన్న లిటిల్ ఫ్లవర్ పాఠశాలలో సైన్స్ డే సందర్భంగా సైన్స్ ప్రాజెక్ట్ ప్రదర్శన కార్యక్రమం కరస్పాండెంట్ వెంగయ్య బుధవారం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రామ్‌కో సిమెంట్ యూనిట్ హెడ్ రెడ్డి నాగరాజు హాజరయ్యారు. కార్యక్రమంలో రామ్‌కో సిమెంట్ జనరల్ మేనజర్ రవికుమార్, ప్రిన్సిపాల్ విమలావతి, రామేశ్వర్ రెడ్డి పాల్గొన్నారు.

సంజామల: మండలంలోని కానాల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బుధవారం జాతీయ సైన్స్ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఇన్‌చార్జి లెక్చరర్ శంకరయ్య ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించారు. భౌతికశాస్త్ర ఉపాధ్యాయుడు శంకరయ్యను ఉపాధ్యాయులు సత్కరించారు. ఉపాధ్యాయులు నారాయణ, రామసుబ్బారెడ్డి, ఓబులేసు, సావిత్రమ్మ,రామిరెడ్డి భీమ్లానాయక్, నాగార్జున, వేణునాథ్, చిన్న మౌలాలి, గాంధీబాబు, మురళీధర్, గ్రామ పెద్దలు పాల్గొన్నాయి.

బేతంచెర్ల: మండలంలో ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలో జాతీయ సైన్స్ దినోత్సవ వేడుకలు బుధవారం ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని శ్రీచైతన్య, భాగ్యోదయ పాఠశాలలో సైన్స్ ఎగ్జిబిషన్ ఏర్పాటు చేసి విద్యార్థులు వివిధ సైన్స్ నమూనాలను ప్రదర్శించారు. కార్యక్రమంలో చైర్మన్ చలంరెడ్డి, కమిషనర్ రమేష్‌బాబు, కవితారెడ్డి అభినందించారు.